
పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136


# పోరు తెలంగాణ

డిజిటల్ తెలుగు దినపత్రిక





కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 మంగళవారం 01-08-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04


## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి

అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్



- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్
- రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి
- సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా
- అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత
- కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, - మిగతా 2 లో

## 'నగరం నడిబొడ్డున కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం'

- సీఎం రేవంత్‌కు హరీశ్ లేఖ
- కాంగ్రెస్ సర్కార్ వందల కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను ప్రైవేటు పరం చేయడానికి కుట్రలు చేస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు
- ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తాము పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.




హైదరాబాద్, ఆగస్టు 30: నగరం నడిబొడ్డున మరో భారీ భూ కుంభకోణానికి కాంగ్రెస్ సర్కార్ తెరలేపిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్, అజామాబాద్‌లో తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన - మిగతా 2 లో

## 169 కి.మీ వేగంతో జలప్రళయం దూసుకొస్తే ఇంకేం మిగులుతుంది!

- నేపాల్‌లో విరిగిపడిన భారీ మంచు కొండ
- గిరాంగ్ పోర్ట్‌ను పూర్తిగా తుడిచిపెట్టిన ప్రవాహం
- గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన వరద
- నదిలో పడటంతో 300 అడుగుల ఎత్తున ఎగిసిపడిన అలలు
- శాస్త్రవేత్తల నివేదికలో వెల్లడైన విపత్తు వివరాలు



నేపాల్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో ఊహించని రీతిలో పెను విపత్తు సంభవించడం తెలిసిందే. ఆ జలప్రళయం 700కి పైగా ప్రాణాలను బలిగొంది. సహాయక చర్యలు కొనసాగేకొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. భారీ మంచు దిబ్బ (గ్లేసియర్) కుప్పకూలడంతో ఏర్పడిన ప్రచండమైన - మిగతా 2 లో

## హర్మూజ్ జలసంధి మా పూర్తి నియంత్రణలోనే: అమెరికా

- జులై నుంచి ఇరాన్ చమురు ఎగుమతులను పూర్తిగా అడ్డుకున్నామని వెల్లడి
- వాణిజ్య నౌకలకు రక్షణ కల్పిస్తున్నామన్న యూఎస్ సెంట్రల్ కమాండ్
- 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్'లో భాగంగానే ఈ చర్యలని స్పష్టం చేసిన వైట్‌హౌస్



కీలకమైన హర్మూజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలోకి వచ్చిందని, అంతర్జాతీయ వాణిజ్య నౌకల రాకపోకలకు మార్గాన్ని - మిగతా 2 లో

## నా జీవితాన్ని నరకం చేశారు

- ప్రధాని మోదీపై రుచికా సింగ్ సంచలన వీడియో
- ప్రధాని మోదీపై వ్యాఖ్యలతో మళ్లీ వార్తల్లోకి వచ్చిన రుచికా సింగ్
- నా జీవితాన్ని మోదీ నరకం చేశారంటూ కొత్త వీడియో విడుదల
- ఇటీవల సీజేపీ నిరసనల వేళ మోదీపైనా, ఆయన తల్లిపైనా తీవ్ర వ్యాఖ్యలు
- క్షమించమని కోరిన నోటితోనే.. ఇప్పుడు తగ్గేదే లేదంటున్న యువతి




ప్రధాని నరేంద్ర మోదీపై, ఆయన దివంగత తల్లిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్తంగా తీవ్ర వివాదంలో చిక్కుకున్న రుచికా సింగ్ మళ్లీ వార్తల్లో నిలిచింది. కొద్ది వారాల క్రితం క్షమించమని వేడుకున్న ఆమె, ఇప్పుడు "నా జీవితాన్ని మోదీ నరకం చేశారు" అంటూ తీవ్ర ఆరోపణలు చేస్తూ ఓ కొత్త వీడియోను విడుదల చేసింది. ఇందులో

## జెండాను కాలితో తన్నుతూ ఖలిస్థానీల కండకావరం



- న్యూయార్క్‌లో ఖలిస్థానీ మద్దతుదారుల దుశ్చర్య
- భారత జాతీయ పతాకాన్ని కాలితో తొక్కిన ఆందోళనకారులు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు
- దేశాన్ని, జెండాను అవమానిస్తే సహించేది లేదని స్ట్రాంగ్ వార్నింగ్
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు

అమెరికాలో ఖలిస్థానీ మద్దతుదారులు మరోసారి రెచ్చిపోయారు. భారత జాతీయ - మిగతా 2 లో

## తలక్రిందులుగా తపస్సు చేసినా వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



- ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు
- నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు
- మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను ఇస్తున్నామన్నారు.

సూర్యాపేట, ఆగస్టు 29: ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా - మిగతా 2 లో

## విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స



- ఈ కామెంట్లపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ
- విజయసాయి రెడ్డిని కేఏ పాల్‌తో పోల్చుతూ ఘాటు విమర్శ
- ఆయన వ్యాఖ్యలతో సమయం వృథా చేసుకోవద్దని పార్టీ శ్రేణులకు సూచన
- విజయసాయి వ్యాఖ్యలతో వైసీపీలో బయటపడిన అంతర్గత విభేదాలు

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. - మిగతా 2 లో

## 30 ఏళ్ల కలను సాకారం చేయనున్న చంద్రబాబు షెడ్యూల్ ఇదే!

- రేపు వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- 30 ఏళ్ల క్రితం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును పూర్తి చేయడంపై సర్వత్రా హర్షం
- తొలి దశలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు
- కరువు పీడిత ప్రాంతాల అభివృద్ధికి రెక్కలు వస్తాయని ఆశాభావం
- 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో ఘనంగా వేడుకలు




ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసుల దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. కరువు నేలకు కృష్ణమ్మ జలాలు పరుగులెత్తనున్నాయి. మార్కాపురం జిల్లాతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాల తలరాతను మార్చగల వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించి, ప్రాజెక్టు తొలి దశను (ఫేజ్-1) లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల

## అంబటి రాంబాబుకు ఫోన్ చేసిన జగన్



- అపోలోలో చికిత్స పొందుతున్న అంబటి రాంబాబు
- గుండెకు రెండు స్టెంట్లు వేసినట్లు వెల్లడి
- ఫోన్‌లో పరామర్శించిన మాజీ సీఎం వైఎస్ జగన్
- ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలో డిశ్చార్జ్ అవుతానని వెల్లడి
- రెండు రోజుల్లో సత్తెనపల్లి వస్తానని చెప్పిన అంబటి

మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంబటి రాంబాబును ఆ పార్టీ అధినేత, - మిగతా 2 లో

## విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

మొదటిపేజీ తరువాయి - వైసీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి నెంబర్ 1 అని, జగన్ నెంబర్ 2 అని ఆయన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. విజయసాయి రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "విజయసాయి రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పని లేదు. రాజకీయాల్లో ఇలాంటి వాళ్లు వస్తూ పోతూ ఉంటారు. ఇంతకుముందు మనకు కేఏ పాల్ ఒకరు ఉండేవారు, ఆయన ఏదేదో మాట్లాడుతుండేవారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రెండో వ్యక్తిగా తయారయ్యారు. ఆయన మాటలకు విలువ ఇచ్చి స్పందించడం అంటే మన సమయాన్ని మనం వృథా చేసుకోవడమే. చూడండి, శుభ్రంగా సాయంత్రం వేళ ప్రశాంతంగా కూర్చున్నాం. ఇలాంటి సమయంలో ఆ పనికిమాలిన మాటల గురించి ఎందుకు మాట్లాడాలి? దానివల్ల నా సమయం వృథా అవ్వడమే కాకుండా, అసలు విషయాలైన ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లుతుంది. ప్రజల సమస్యలు ఎన్నో ఉన్నాయి, వాటిపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలాంటి వాటి కోసం కాదు. ఆయనకేదో అది పెద్ద విషయంలా అనిపిస్తే, దానికోసం ఒక ప్రెస్ మీట్ పెట్టుకోమనండి. బహిరంగంగా చెప్పుకోమనండి. అంతేగానీ, దానికోసం మేం సమయం కేటాయించం. అనవసరంగా ఇలాంటి విషయాల గురించి చర్చించి మన విలువైన సమయాన్ని పాడుచేసుకోవడం ఎందుకు? కాబట్టి, ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ అడిగి మీ సమయం, నా సమయం వృథా చేయొద్దని కోరుతున్నాను" అని బొత్స పేర్కొన్నారు.

## అంబటి రాంబాబుకు ఫోన్ చేసిన జగన్

మొదటిపేజీ తరువాయి - మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరిన అంబటి రాంబాబుకు వైద్యులు రెండు స్టెంట్లు అమర్చారు. ఈ నేపథ్యంలో జగన్ ఆయనకు ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తనకు అందించిన చికిత్స వివరాలను అంబటి రాంబాబు జగన్‌కు వివరించారు. అనూహ్యంగా ఆసుపత్రికి రావాల్సి వచ్చిందని, వైద్య పరీక్షల అనంతరం రెండు స్టెంట్లు వేసినట్లు తెలిపారు. అపోలో వైద్యులు తనకు మెరుగైన చికిత్స అందించారని, ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆయన చెప్పారు. త్వరలోనే తాను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతానని జగన్‌కు వివరించారు. ప్రస్తుతం అంబటి రాంబాబును వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఒకటి రెండు రోజుల్లోనే సత్తెనపల్లికి వస్తానని అంబటి పేర్కొనడంతో, ఆయన ఆరోగ్యం వేగంగా కుదుటపడుతున్నట్లు తెలుస్తోంది.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి

మొదటిపేజీ తరువాయి - పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## తలక్రిందులుగా తపస్సు చేసినా.. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే: మంత్రి పొంగులేటి

మొదటిపేజీ తరువాయి - చేసినా సంక్షేమం ఆగలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈరోజు(శనివారం) మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని నూతనకల్, మద్దిరాల మండలాల్లో 15 గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాలకు సంబంధించిన భూమి పట్టాలను అందజేస్తున్నామన్నారు. పిల్లల చదువు కోసం, అవసరాల కోసం భూమిని అమ్ముకొనే అవకాశం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే పట్టాదార్ పాస్‌బుక్కులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 'మీరు తలక్రిందులుగా తపస్సు చేసినా మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది' అని మంత్రి స్పష్టం చేశారు. 63 వేల కోట్ల ఆడబిడ్డలకు సున్నా వడ్డీకి రుణాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు అందించామని తెలిపారు. సర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను తీసుకున్నామని.. ఈ సర్వేతో దొంగ పట్టాలను గుర్తించవచ్చని చెప్పారు. రాబోయే సంవత్సరన్నర కాలంలో ప్రతి అంగుళం సర్వే చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తే ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

## జెండాను కాలితో తన్నుతూ ఖలిస్థానీల కండకావరం

మొదటిపేజీ తరువాయి - పతాకాన్ని దారుణంగా అవమానించారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వారికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళ్తే, న్యూయార్క్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్ పాల్గొన్న ఓ కార్యక్రమం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. అక్కడికి చేరుకున్న కొందరు ఖలిస్థానీ సానుభూతిపరులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వారు భారత జాతీయ జెండాను కిందపడేసి, కాళ్లతో తొక్కారు. అంతటితో ఆగకుండా జెండాను చించివేస్తూ దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోలపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా స్పందించారు. ఖలిస్థానీలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "మీకు ఆర్ఎస్ఎస్‌ను, బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించే స్వేచ్ఛ ఉంది. కానీ మన దేశాన్ని అవమానించవద్దు. జాతీయ జెండాను అగౌరవపరచవద్దు. అది మీకు చాలా ప్రమాదకరం" అని ఆయన తన పోస్టులో స్పష్టం చేశారు విదేశీ గడ్డపై భారత జాతీయ పతాకానికి జరిగిన ఈ అవమానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేశ గౌరవానికి భంగం కలిగించే ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని కేంద్రం ఈ హెచ్చరిక ద్వారా తేల్చిచెప్పినట్టయింది.

## 169 కి.మీ వేగంతో జలప్రళయం దూసుకొస్తే ఇంకేం మిగులుతుంది!



మొదటిపేజీ తరువాయి - కొనసాగేకొద్దీ మృతుల సంఖ్య పెరుగుతోంది. భారీ మంచు దిబ్బ (గ్లేసియర్) కుప్పకూలడంతో ఏర్పడిన ప్రచండమైన ప్రవాహం ఓ ప్రాంతాన్ని పూర్తిగా తుడిచిపెట్టేసింది. గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఈ మంచు, రాళ్ల వరద సృష్టించిన బీభత్సం వివరాలను శాస్త్రవేత్తలు తమ నివేదికలో వెల్లడించారు. వారి కథనం ప్రకారం, లాంగ్‌టాంగ్ లిరుంగ్ పర్వత శ్రేణిలో సుమారు 16,700 అడుగుల ఎత్తు నుంచి ఓ భారీ మంచు శిఖరం విరిగిపడింది. దాదాపు 1.5 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ మంచు పర్వతం, భారీగా రాళ్లు, మట్టి సహా సమీపంలోని నదిలో కుప్పకూలింది. దీంతో నదిలో సుమారు 300 అడుగుల ఎత్తున ఓ రాకాసి అల ఏర్పడింది. ఈ భీకర ప్రవాహం అసాధారణ వేగంతో పర్వత లోయల గుండా ప్రయాణించింది. గంటకు 169 కిలోమీటర్ల వేగంతో దూసుకొచ్చిన ఈ మంచు, బురద, రాళ్ల మిశ్రమ ప్రవాహం ధాటికి దాని మార్గంలోని గిరాంగ్ పోర్ట్ అనే ప్రాంతం పూర్తిగా జలసమాధి అయింది. క్షణాల్లోనే ఈ ప్రాంతం రూపురేఖలు లేకుండా సర్వనాశనమైందని శాస్త్రవేత్తలు వివరించారు. హిమాలయాల్లో వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి విపత్తులు సంభవిస్తున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# నా జీవితాన్ని నరకం చేశారు



మొదటిపేజీ తరువాయి - ప్రధానిపై తీవ్ర పదజాలం వాడుతూ, తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేయడం సంచలనం రేపుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ కొత్త వీడియోలో ఆమె మాట్లాడుతూ, "మోదీ నా జీవితాన్ని నరకప్రాయం చేశారు. నాకు స్వేచ్ఛ లేదు. ఎక్కడికి వెళ్లినా ముఖం దాచుకోవాల్సి వస్తోంది. ఓ 15 ఏళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేశారు. ఇకపై నేను కోల్పోవడానికి ఏమీ లేదు" అని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రధానిని 'పిరికివాడు' అని సంబోధిస్తూ, తాను ఈ పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కొద్ది వారాల క్రితం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో రుచికా సింగ్.. ప్రధాని మోదీపై, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నోయిడా పోలీసులు జూలై 29న జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, కేసును ఢిల్లీ పోలీసులకు బదిలీ చేశారు. అప్పట్లో తాను 15 ఏళ్ల బాలికనని, స్నేహితులతో కలిసి నిరసనకు వెళ్లి ఆవేశంలో అలా మాట్లాడానని, మోదీ క్షమించే వరకు క్షమాపణలు కోరుతూనే ఉంటానని మరో వీడియోలో ఆమె పేర్కొంది. ఈ వివాదంపై ప్రధాని మోదీ స్వయంగా స్పందించి, యువత పట్ల ఉదారంగా ఉండాలని సూచించడంతో, ఆమెపై కేసును ఉపసంహరించుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు మళ్లీ ఆమె తిరుగుబాటు ధోరణితో మాట్లాడటం చర్చనీయాంశమైంది. కాగా, ఈ కొత్త వీడియో ఎక్కడ, ఎప్పుడు రికార్డ్ చేశారనే దానిపై స్పష్టత లేదు. వీడియోలో ఉన్నది నిజంగా రుచికా సింగేనా, ఆమె వయసు ఎంత అనే దానిపై కూడా అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ వీడియో ప్రామాణికతను స్వతంత్రంగా ధృవీకరించలేదని, అందువల్ల దీనిలోని ఆరోపణలను కేవలం ఆరోపణలుగానే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కొత్త క్లిప్ సోషల్ మీడియాలో మరోసారి భిన్నాభిప్రాయాలకు దారితీసింది.

# 'నగరం నడిబొడ్డున కాంగ్రెస్ భారీ భూ కుంభకోణం'

మొదటిపేజీ తరువాయి - రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రేవంత్ సర్కార్ రూ.87 కోట్లకే ప్రైవేటు పరం చేయడానికి కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. నగరం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని ఆయన లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే తాము పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులను కమీషన్ల కోసం పాలకులు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. 'ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన రేవంత్ సర్కార్.. రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయింది. రూ.500 కోట్ల విలువ చేసే ఆయిల్‌ఫెడ్ భూములను కేవలం రూ.87 కోట్లకు ప్రైవేటు పరం చేయడానికి సిద్ధమైంది' అని హరీశ్ లేఖలో రాసుకొచ్చారు. ఆ సొమ్మును చెల్లించేందుకు ఆయిల్‌ఫెడ్ సిద్ధంగానే ఉందని, అయినా వారిని కాదని ప్రైవేటు వ్యక్తులకై భూములను ఇచ్చేందుకు ప్రభుత్వం ఎందుకు ఉత్సాహం చూపిస్తోందని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రైవేట్ శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తిని చిత్తశుద్ధితో కాపాడామని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. పేదల పొట్టగొట్టి పెద్దలకు పల్లీలు, బఠాణీల్లా వేల కోట్ల రూపాయల భూములు పంచుతోందని ఘాటు విమర్శలు చేశారు. 1987లో సుప్రీంకోర్టు ప్రైవేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా.. కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలోకి తొక్కారని ధ్వజమెత్తారు. ఒకవైపు సామాన్యుల ఇళ్లను 22ఏ జాబితాలో పెట్టి వేధిస్తున్న ప్రభుత్వం.. మరోవైపు ఖరీదైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం కారుచౌకగా ప్రైవేట్‌కు ధారాదత్తం చేస్తోందని ఫైరయ్యారు. ఇలా స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే భవిష్యత్తులో గుడికి, బడికి, చివరికి శ్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదని మండిపడ్డారు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దుచేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలని హరీశ్‌రావు సూచించారు. ప్రజల సొత్తును ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మహా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## 30 ఏళ్ల కలను సాకారం చేయనున్న చంద్రబాబు.. షెడ్యూల్ ఇదే!

మొదటిపేజీ తరువాయి - ల్లాలో పర్యటించి, ప్రాజెక్టు తొలి దశను (ఫేజ్-1) లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. మూడు దశాబ్దాల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, ఇప్పుడు తన చేతుల మీదుగానే తొలి దశను ప్రారంభించనుండటం ఒక చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది.

### జీవనాధార ప్రాజెక్టుతో కొత్త అధ్యాయం

తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ భూతంతో దశాబ్దాలుగా అల్లాడుతున్న పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్టు కాదు, అదొక జీవనాధారం. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు తరలించి, అక్కడి నుంచి కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలు తీర్చడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. తొలి దశ ప్రారంభంతో 10.70 టీఎంసీల కృష్ణా జలాలను విడుదల చేయనున్నారు. దీని ద్వారా తక్షణమే 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, సుమారు 4 లక్షల మంది ప్రజలకు సురక్షిత తాగునీరు అందనుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మొత్తం 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 మండలాల్లోని సుమారు 23 లక్షల మందికి తాగునీటి భద్రత లభిస్తుంది. ఈ జలాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయ రంగంలో అనిశ్చితి తొలగిపోయి, వివిధ రకాల పంటలు పండించేందుకు మార్గం సుగమమవుతుంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గి, ఉద్యానవనం, ఆగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనుబంధ రంగాల అభివృద్ధికి ఊతమిస్తుంది. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, వలసలకు శాశ్వతంగా అడ్డుకట్ట పడనుంది.

### సంకల్పం నుంచి సాకారం వరకు... 30 ఏళ్ల ప్రయాణం

1996లో చంద్రబాబు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు ప్రయాణం అంత సులభంగా సాగలేదు. సొరంగాల నిర్మాణం, భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం వంటి క్లిష్టమైన సాంకేతిక, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పనులు కొనసాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన వెంటనే, వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా గుర్తించి పనులను పరుగులు పెట్టించింది. ముఖ్యంగా, ప్రాజెక్టు పురోగతికి అడ్డంకిగా మారిన నిర్వాసితుల పరిహారంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలోనే నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారాన్ని చెల్లించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంది. అంతేకాకుండా, గెజిట్, జాబితాలలో పేర్లు లేని వారికి రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు రూ.2 లక్షల చొప్పున అదనపు పరిహారం ప్రకటించి వారిలో భరోసా నింపింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబే, ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అనే అరుదైన ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుండటంతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు మార్కాపురం జిల్లాలో ఈ క్రింది షెడ్యూల్ ప్రకారం పర్యటించనున్నారు:

ఉదయం 9:30: ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు.

ఉదయం 10:15: మార్కాపురం జిల్లా, దోర్నాల మండలం, గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

ఉదయం 10:25: రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదిక వద్దకు చేరుకుంటారు.

ఉదయం 10:35 - 11:20: ప్రత్యేక పూజలు నిర్వహించి, పైలాన్‌ను ఆవిష్కరించి, గేట్లను ప్రారంభించి కృష్ణా జలాలను విడుదల చేస్తారు.

ఉదయం 11:30: గంటవానిపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

మధ్యాహ్నం 1:30: సభ అనంతరం తిరుగు ప్రయాణమవుతారు.

మధ్యాహ్నం 2:15: ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

ఈ చారిత్రక ఘట్టంతో మార్కాపురం సహా రాయలసీమ కరవు పీడిత ప్రాంతాల అభివృద్ధికి కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రజలు గట్టిగా విశ్వసిస్తున్నారు.

# హర్మూజ్ జలసంధి మా పూర్తి నియంత్రణలోనే: అమెరికా

మొదటిపేజీ తరువాయి - సురక్షితం చేశామని అమెరికా ప్రకటించింది. ఇరాన్ నుంచి చమురు ఎగుమతులను సంపూర్ణంగా నిలువరించినట్లు శ్వేతసౌధం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గతంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ధ్రువీకరిస్తూ ఈ వివరాలను వెల్లడించింది. అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) నివేదికను ఉటంకిస్తూ వైట్‌హౌస్ ఈ గణాంకాలను వెల్లడించింది. అంతర్జాతీయ నౌకాయాన మార్గాల్లో ఇరాన్ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించి, ఇప్పటివరకు సుమారు 1,500 వాణిజ్య నౌకలకు పటిష్ఠమైన రక్షణ కల్పించినట్లు పేర్కొంది. ఈ నౌకల ద్వారా దాదాపు 75 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు ప్రపంచ మార్కెట్లకు సురక్షితంగా చేరిందని వివరించింది. జూలైలో దిగ్బంధనం పునఃప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ నుంచి ఎలాంటి చమురు ఎగుమతులు జరగలేదని, నిబంధనలు ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన 75 నౌకలను వెనక్కి పంపినట్లు స్పష్టం చేసింది. "హర్మూజ్ జలసంధిని ప్రస్తుతం యునైటెడ్ స్టేట్స్ నేవీ మాత్రమే నియంత్రిస్తోంది. మా దిగ్బంధనం ఉక్కు గోడలాంటిది. 100 శాతం జలసంధి మా ఆధీనంలో ఉంది" అని ట్రంప్ గతంలో చేసిన వ్యాఖ్యలను వైట్‌హౌస్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్'లో భాగంగా ఇరాన్ ఆదాయ మార్గాలను దెబ్బతీయడానికే ఈ దిగ్బంధనాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొంది. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైంది. భారత్‌తో సహా అనేక దేశాల ఇంధన భద్రతకు ఈ మార్గం ఎంతో ప్రధానం. అంతర్జాతీయ సమాజానికి ఇరాన్ నుంచి ముప్పు తొలగిపోయే వరకు ఒత్తిడి కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. అయితే, ఈ పరిణామాలపై ఇరాన్ నుంచి తక్షణమే ఎలాంటి స్పందన రాలేదు.ద్వారా దాదాపు 75 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు ప్రపంచ మార్కెట్లకు సురక్షితంగా చేరిందని వివరించింది.

## వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్



మొదటిపేజీ తరువాయి - నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. "ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం"గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. దీంతో అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది. ఈ నిల్వలు 2026 ప్రారంభం నుంచి 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా తగ్గి, 300 మిలియన్ బ్యారెళ్ల దిగువకు పడిపోయాయి. సుమారు 9 నెలల క్రితం అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ కోసం అమెరికాకు తరలించింది. అనంతరం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్, దేశ చమురు రంగాన్ని ప్రైవేటీకరణకు అనుమతిస్తూ చట్టం చేశారు. దశాబ్దాల సోషలిస్ట్ పాలనకు ఇది పూర్తి విరుద్ధం. ఈ మార్పే తాజా ఒప్పందానికి మార్గం సుగమం చేసింది. ఈ ఒప్పందం ద్వారా వెనెజువెలాలోకి 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయని, అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గుతాయని మార్కో రూబియో 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాల కారణంగా వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఎంతవరకు ముందుకొస్తాయనేది వేచి చూడాలి. గతంలో ఎక్సాన్‌మొబిల్ సీఈఓ డారెన్ వుడ్స్, వెనెజువెలాను 'పెట్టుబడులకు అనర్హమైన దేశం'గా అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు (సుమారు 303 బిలియన్ బ్యారెళ్లు) ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాల కొరతతో వెనెజువెలా ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో కేవలం 1% మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.

## శభాష్ యువత కదలని యంత్రాంగం, మొద్దు నిద్రలో అధికారులు





**పోరు తెలంగాణ : (చాట్ల జితేంద్ర, వేల్పూర్ ) :** వేల్పూర్ మండలంలోని మోతే వేల్పూర్ మధ్య రహదారిలో ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంతలు ఏర్పడడంతో ఈరోజు ఉదయం బైకు స్కిడ్ అయ్యి తండ్రి కూతుర్లకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కొందరు మోతే గ్రామ యువకులు సిమెంటు కంకరతో ఆ భారీ గుంతలను వారి సొంత ఖర్చులతో పుడ్చారు.అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన ఫలితం లేకపోవడంతో మేమే గుంతలను పుడ్చమని ఆ యువకులు తెలిపారు. యువకులు చేసిన పనికి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా స్పందించి ఆ గుంతలను పూడ్చి వేయాలని కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో సుమన్,శ్రీ నాథ్,భరత్,రంజిత్ పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఆటో డ్రైవర్ ఇస్మాయిల్

### అభినందించి చిరు ప్రోత్సాహం అందించిన స్థానిక ఎస్సై




**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలం వన్నెల్ (బి) గ్రామానికి చెందిన సయ్యద్ ఇస్మాయిల్, ఆర్మూర్ నుండి బాల్కొండకు వస్తుండగా ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో చిట్టాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద రాత్రి సమయంలో ఆటో లోని ప్రయాణికులను దింపుతుండగా రోడ్డు ప్రక్కన చరవాణి ని కనుగొన్నాడు.దానితో ఆటో డ్రైవర్ ఇస్మాయిల్ చరవాణి ని తీసుకొని సోమవారం ఉదయం బాల్కొండ పోలీస్ స్టేషన్లో అప్పగించాడు, స్థానిక ఎస్సై కే. శైలేందర్ ఆటో డ్రైవర్ ఇస్మాయిల్ ను అభినందించి చిరు ప్రోత్సాహం అందించారు.వెంటనే చరవాణి పోగొట్టుకున్న వ్యక్తిని పిలిపించి వారికి అందించారు.ఆటో డ్రైవర్ ఇస్మాయిల్ లాంటి వారే ఈ సమాజానికి అవసరమని మాట్లాడుతూ,తనను ఆదర్శంగా తీసుకొని ప్రజలు ఏ వస్తువు దొరికిన సంబంధిత పోలీస్ స్టేషన్ లో అప్ప జెప్పాలని ఎస్సై పేర్కొన్నారు.

## బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లితండ్రులు,ఉపాధ్యాయుల సమీక్షా సమావేశం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ప్రభుత్వ జూనియర్ కళాశాల బాల్కొండలో సోమవారం ప్రిన్సిపాల్ రజియుద్దీన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్కొండ ఎస్సై శైలేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు అలవాటు పడకుండా బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆశించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల పైన ప్రతినిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం స్టూడెంట్ కౌన్సిలర్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు సమయానికి కళాశాల చేరుకోవాలని, కళాశాల ముగిసిన అనంతరం ఇంటికే వెళ్లాలని ఆదేశించారు. తమ పిల్లలు కళాశాలలో ఎలా చదువుతున్నారు, అన్నది వారి యొక్క ప్రవర్తన పైన తల్లిదండ్రులు నిఘా ఉంచాలని తెలిపారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సదా మురళి మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణలో ఉండాలని, వ్యసనాలకు అలవాటు పడకుండా క్రమ పద్ధతిలో ఉంటూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకి రోజుకు ఒక గంట సమయాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కిసాన్ నగర్ గ్రామంలోని ముస్లిం మైనార్టీల ఈద్గాలో బోరు ప్రారంభం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామంలోని ముస్లిం మైనారిటీల ఈద్గాలో బోరును సర్పంచ్ రామరాజు గౌడ్ సోమవారం ప్రారంభించారు.రాజ్యసభ సభ్యుడు కె.ఆర్ సురేష్ రెడ్డి తన నిధుల నుండి మంజూరు చేసిన లక్ష ఇరవై ఐదు వేలతో మోటారుతో సహా బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ స్వామి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు షేక్ రహీముద్దీన్, వాహిద్, వెంకటేష్, ముస్లిం కమిటీ అధ్యక్షుడు మష్రత్ పాషా, సభ్యులు ముజీబ్,ఖాలీద్, ముంతాజ్, కలీం, మున్వర్,అయ్యుబ్ తదితరులు పాల్గొన్నారు.ఈద్గాలో మంచి నీటి వసతులు కల్పించినందుకు ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డికి, మండల బిఆర్ ఎస్ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి కి ముస్లిం సోదరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపల్లి గ్రామంలో మండల బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై మండల బి ఆర్ ఎస్ పార్టీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముప్కాల్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం నర్సారెడ్డి, కార్యదర్శి ఉమాశంకర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్లు, ప్రస్తుత సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపిటిసిలు, మాజీ ఉపసర్పంచులు,ఆయా గ్రామ శాఖల అధ్యక్షులు,యువజన సంఘ నాయకులు,ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## ఖమ్మం టీయూసీఐ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలి

### టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 31(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** ఖమ్మం పట్టణంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబర్ 6న నిర్వహించనున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని టీయూసీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు గోనెల రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం పాల్వంచలోని కేజీబీవీ హాస్టల్‌లో టీయూసీఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోనెల రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు కల్పిస్తామని ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా, మూడు సంవత్సరాలు గడుస్తున్నా వాటి అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రోజురోజుకూ నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల విద్యాభివృద్ధిలో భాగంగా కేజీబీవీలను కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేయడం స్వాగతించదగ్గ విషయమేనని, అయితే అందుకు అనుగుణంగా నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులపై అదనపు పనిభారం పడుతోందన్నారు. కాంట్రాక్టు కార్మికులతో అధిక పనిని చేయించుకుంటూ వేతనాలు పెంచకపోవడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శ్రమ దోపిడీకి నిదర్శనమని ఆరోపించారు. గతంలో నియమితులై ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పలువురు కార్మికులకు 18 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచేలా ప్రభుత్వంపై చేపట్టాల్సిన పోరాట కార్యాచరణపై సెప్టెంబర్ 6న జరిగే రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ పాల్వంచ ఏరియా కమిటీ నాయకులు కుంజా భాస్కర్, కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్లు కుమారి, లక్ష్మీ, శారద లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి లేదంటే వంటావార్పు

### సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరిక





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 31(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్రజలను సమీకరించి వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సీపీఎం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం పాల్వంచ పట్టణ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అల్లూరి సెంటర్‌లోని సీపీఎం కార్యాలయం నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు, ప్రజలు ప్రదర్శనగా తరలివచ్చారు. అనంతరం పట్టణ కార్యదర్శి పి. తులసీరామ్ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణంలోని నిరుపేదలు ఇళ్లు, ఇంటి స్థలాల కోసం అనేక సంవత్సరాలుగా అధికారులను కోరుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పట్టణంలో కుక్కలు, కోతుల బెడదను నివారించాలని, డ్రైనేజీలను శుభ్రం చేయాలని, వీధిలైట్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆక్రమించిన సమయంలో ప్రభుత్వ అధికారులు స్పందించి ప్రజలతో చర్చలు జరిపారని గుర్తు చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేసి, అర్హులైన పేదలను గుర్తించి ఇళ్లు కేటాయిస్తామని హౌసింగ్ పీడీ, ఆర్డీఓ, స్థానిక తహసీల్దార్ హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇప్పటివరకు ఆ హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అర్హులైన పేదల వివరాలతో తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేసినా, అధికారులు లబ్ధిదారుల వద్దకే వచ్చి వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందేలా చూస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం. జ్యోతి, జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ రవికుమార్, పార్టీ పట్టణ కార్యవర్గ సభ్యులు కే. సత్య, కమిటీ సభ్యులు సులోచన, బి. కాంతి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యూచర్ సిటీలో కలిపేవరకు దశలవారీగా పోరాటాలు

### రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు ఫ్యూచర్ సిటీకి మద్దతు పలకండి..

### ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షుడు వత్తుల రఘుపతి..

### గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ నేత..





**మహేశ్వరం, ఆగస్టు 31, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపేవరకు దశల వారీగా పోరాటాలకు సిద్ధం కావాలని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్ నేత పిలుపునిచ్చారు. సోమవారం మహేశ్వరం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. ఈ దీక్షలకు కాంగ్రెస్, బిజెపి, సిపిఐ, సిపిఎం, ఎమ్మార్పీఎస్ నేతలు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ.. గత ఏడాది కాలం నుండి మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కల్పాలని కోరుతూ అనేక ఉద్యమాలను చేపట్టినట్లు వారు గుర్తు చేశారు. కిందిస్థాయి నేతల నుండి మంత్రులు సీఎం వరకు మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపాలని కోరుతూ వినతి పత్రాలను ఇవ్వడం జరిగిందని అన్నారు. రోజురోజుకు ఫ్యూచర్ సిటీ పనులు వేగవంతంగా జరుగుతున్నప్పటికీ మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీకి కూతవేటు దూరంలో ఉండి మండలాన్ని ఫ్యూచర్ సిటీలో ఎందుకు కలపడం లేదని వారు ప్రశ్నించారు. మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో కలపకపోతే ఈ ప్రాంత రైతాంగం, యువత, వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, తీవ్రంగా నష్టపోతారని వారు ఆవేదన వ్యక్తపరిచారు. ప్రభుత్వం పునరాలోచించి మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేస్తూ అధికారికంగా ఉత్తర్వులను జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలాన్ని విలీనం చేసే వరకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నరసింహ,బిజెపి సీనియర్ నాయకులు కడారి జంగయ్య యాదవ్, సీనియర్ నాయకులు కూన యాదయ్య, మాజీ ఎంపిటిసి పోతర్ల సుదర్శన్ యాదవ్, సిపిఐ రాష్ట్ర నాయకుడు దత్తు నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వట్టెల మల్లేష్ యాదవ్, పాండు నాయక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, మన్ సాన్ పల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ బురమోని నరసింహ యాదవ్, మాజీ జెడ్పీటీసీ ఈశ్వర్ నాయక్, నాయకులు మల్లేష్, రమేష్, సాంబయ్య యాదవ్, ఇంద్రకంటి నరసింహ గౌడ్, ఇంద్రగంటి వెంకటేష్ గౌడ్, సర్దార్ నగర్ బిజెపి నాయకులు స్వామి గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొని జేఏసీ నేతలకు సంఘీభావం తెలిపారు. మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు చిలకమర్రి నరసింహ జేఏసీ నాయకులకు నిమ్మరసం అందజేసి దీక్షలను విరమింపజేశారు

## రైతులు, పేదల సమస్యలను పరిష్కరించాలి

### సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్..



**మహేశ్వరం, ఆగస్టు 31, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని, సమస్యల పరిష్కారం కోసం ఈ రోజు మహేశ్వరం మండల తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాను ఉద్దేశించి శేఖర్ మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్ళు అవుతున్న హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. పెన్షన్లు పెంచుతామని చెప్పి ఉన్న పెన్షన్లనే తగ్గిస్తున్నారన్నారు. తక్షణమే పెన్షన్లను పెంచాలని అలాగే మహిళలకు నెలకు 2500 ఇవ్వాలన్నారు. రేషన్ షాపుల్లో బియ్యంతో పాటు 14 రకాల నిత్యాసర సరుకులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో నెలకొన్న అనేక సమస్యల పరిష్కారం చేయాలి. ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ హామీపై విశ్వాసంతో ఫ్యాబ్సిటీ రైతులు 93 రోజులు రిలే దీక్షలు విరమించామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లేమూరు సర్వే నెం.102లో ఇళ్ల స్థలాల కేటాయింపు, రిజిస్ట్రేషన్లను తక్షణమే పూర్తి చేసి రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్, ఫ్యాబ్సిటీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోదాసు నరసింహ, ఫ్యాబ్సిటీ నాయకులు పాలకూర నాగేష్, మునుగని గిరీష్, రమేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## చేయూత పింఛన్ల దరఖాస్తులకు మరో 15 రోజులు, గడువును పెంచండి

### ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడారం వినయ్ కుమార్..

**మహేశ్వరం, ఆగస్టు 31, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పింఛన్ల దరఖాస్తులకు సమయం సరిపోయే అవకాశం లేనందున మరో 15 రోజులు సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వవలసిందిగా ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు ప్రభుత్వాన్ని కోరారు. ఒంటరి మహిళలు కల్లుగీత కార్మికులు డయాలసిస్ బాధితులకు వికలాంగులకు, పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని అయితే దీనికి సరైన ప్రచారం లేకపోవడం వల్ల అనేకమంది అర్హులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కులము, ఆదాయం, నివాసం, సదరం, సర్టిఫికెట్లు సమర్పించాల్సినప్పటికీ వివిధ మండలాలలో అధికారులు నిర్లక్ష్యం వల్ల సకాలంలో కులము నివాసం ఆదాయం సర్టిఫికెట్లు పింఛనుకు దరఖాస్తు చేసే అభ్యర్థులకు అందించలేకపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో అనేకమంది అర్హులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తక్కువ సమయం ఇవ్వడం వల్ల అర్హులైన వారికి పెన్షన్లు అందక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 15 వ తేదీ వరకు వివిధ పెన్షన్లకు దరఖాస్తు చేసుకునే వారికి మరికొన్ని రోజులు అవకాశం ఇవ్వాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## యాదవులందరూ ఐక్యంగా ఉండాలి

### అధ్యక్షులు వేల్పుల ఐలయ్య యాదవ్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఆగస్టు 31 సోమవారం శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం ఆవరణలో పిట్టల ఎల్లయ్య పల్లి గ్రామానికి చెందిన వేల్పుల ఐలయ్య యాదవ్ ఓదెల మండల యాదవ్ సంఘ అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కమిటీ సభ్యులతో కలిపి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు అనంతరం విలేకర్ల సమావేశంలో అధ్యక్షులు ఐలయ్య మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు యాదవ సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు యాదవులందరూ ఆర్థికంగా రాజకీయంగా అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. కావాటి రాజు యాదవ్ మాట్లాడుతూ మండలంలోని యాదవులందరూ ఐక్యంగా ఉండాలని అన్నారు గోపరపల్లి సర్పంచ్ మద్దే వేణి రవి యాదవ్ మాట్లాడుతూ యాదవుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వాన్ని కోరతామని అలాగే నూతనంగా ఎన్నికైన సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు., ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బండారి శ్రీనివాస్ యాదవ్ మాజీ యాదవ సంఘం మండల అధ్యక్షులు కావటి రాజు యాదవ్, పొలం మల్లయ్య యాదవ్.జంగా కనుకయ్య యాదవ్.పొలం మల్లయ్య యాదవ్.మ్యాకల వెంకటేష్ యాదవ్.సింగరావేనా చిన్న ఓదెలు యాదవ్ కార్యదర్శులు గా మ్యాకల వెంకటేష్ యాదవ్ ముత్యాల తిరుపతి యాదవ్.మ్యాకల సమ్మయ్య.సహాయ కార్యదర్శి జక్కుల రాజు యాదవ్.గుండేటి ఐలయ్య యాదవ్ .కోశాధికారిగా బండ రాజు యాదవ్.కార్యవర్గ సభ్యులుగా జక్కుల రాజమల్లు యాదవ్.నల్లగషా రాజుయాదవ్ లున్నారు.

# బిఆర్ఎస్ నాయకులపై మహిళా కాంగ్రెస్ అగ్రహం

## మహిళలను అవమానించిన నాయకులకు హెచ్చరిక

**భద్రాచలం ఆగస్టు 31 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం మహిళా కాంగ్రెస్ నాయకులు సమావేశమై.. బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిన్న నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పై, మహిళల శుభకార్యాలు మరియు సంప్రదాయాలపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజల కుటుంబాల్లో జరిగే శుభకార్యాలకు హాజరై, వారి సంతోషంలో భాగస్వామి కావడం ప్రజా ప్రతినిధిగా ఎమ్మెల్యే బాధ్యత అని, దానిని కూడా రాజకీయ విమర్శలకు వాడుకోవడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. మహిళలు నిర్వహించే ఓణీల కార్యక్రమాలు, పంచకట్టు వేడుకలు, ఇతర శుభకార్యాలకు ఎమ్మెల్యే హాజరవడాన్ని అవహేళన చేసేలా వ్యాఖ్యలు చేయడం మహిళలను, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను అవమానించడమేనని అన్నారు. "రాజకీయ విమర్శలు చేయండి.. మహిళలను మాత్రం కించపరచొద్దు" అని అన్నారు



**"మహిళా సంక్షేమంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు"**

ఎక్స్ ఎంపీటీసీ మానే కమల మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 'మహిళా శక్తి' కార్యక్రమం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలకు గౌరవం, ఆర్థిక స్వావలంబన కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు.. మహిళల గురించి తమ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. "ప్రజల కుటుంబాల్లో ఎమ్మెల్యే భాగస్వామి కావడం మీకు ఎందుకు కనిపించదు?" కాంగ్రెస్ నాయకురాలు పిట్టల లక్ష్మీకాంతం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రజలతో ఆత్మీయంగా మెలుగుతూ ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటున్నారని అన్నారు. "మహిళలపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే గట్టిగా ప్రతిఘటిస్తాం" కాంగ్రెస్ నాయకురాలు కాసింబి మాట్లాడుతూ.. మహిళల గురించి బీఆర్ఎస్ నాయకులు మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే మహిళా కాంగ్రెస్ తరఫున తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. "మహిళల శుభకార్యాలను రాజకీయాలకు లాగడం మానుకోండి. "ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రజల మధ్య ఉంటే ఓర్వలేక విమర్శలు చేయడం కాదు.. ప్రజల కోసం మీరు ఏం చేశారో చెప్పండి. ప్రజల తీర్పే అంతిమ సమాధానం." అని మహిళా కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రల సత్యవేణి, షేక్ మైదులిబి, విజయలక్ష్మి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి ప్రధాన లక్ష్యం

## ప్రజావాణిలో 67 దరఖాస్తుల స్వీకరణ...

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 31. (పోరు తెలంగాణ న్యూస్:) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, వాటిని సత్వరమే పరిష్కరించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విక్టర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చందర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 67 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి అందే ప్రతి వినతిపై నిర్లక్ష్యం లేకుండా స్పందించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారుల



సమస్యలను పూర్తిగా తెలుసుకొని, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని అన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో శాఖల మధ్య సమన్వయం పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో



అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పాండు, శిక్షణ కలెక్టర్ రవితేజ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా దిబ్బెందల సాయికుమార్ మాదిగ ఎన్నిక



**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ చెంగల గురునాథం మాదిగ అధ్యక్షతన నూతన మండల కమిటీ ఎన్నిక కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చెంగల గురునాథం మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలో ఏడు గ్రామాల గ్రామ అధ్యక్షులు మరియు గ్రామ కమిటీల ఏకగ్రీవ తీర్మానం మేరకు దిబ్బెందల సాయికుమార్ మాదిగ ని




జూలూరుపాడు మండల ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. మాదిగల హక్కుల సాధన కోసం,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ముందుకు కొనసాగి మండలంలో సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన అధ్యక్షుడు సాయికుమార్ మాదిగ తెలిపారు. ఉపాధ్యక్షుడిగా:గార్లపాటి నవీన్,ప్రధాన కార్యదర్శిగా దొంగల సృజన్,సహాయ కార్యదర్శిగా,పోతురాజు అనిల్ కుమార్,అధికార ప్రతినిధి గార్లపాటి నిఖిల్,కోశాధికారి ఉబ్బపల్లి నరసింహారావు,కార్యవర్గ సభ్యులు జంగం నాగరాజు లను మండల కమిటీగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో కాకటి కృష్ణ,గార్లపాటి కృష్ణ, గార్లపాటి శివ కృష్ణ,బద్రి, విసనపల్లి కళ్యాణ్, నీలాల నరేష్ బాబు,మండలంలోని ఏడు గ్రామాల ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు,గ్రామ కమిటీ సభ్యులు,ఎమ్మార్పీఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు,ప్రజల సమస్యలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటం




**పోరు తెలంగాణ జూలూరుపాడు ప్రతినిధి సురేష్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా సిపిఎం పార్టీ జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో హాస్పిటల్ మరియు హాస్టల్ సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యాస నరేష్ మాట్లాడుతూ గత నెలలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో జూలూరుపాడులో ఉన్న ప్రభుత్వ దవాఖానాలో సర్వే నిర్వహించామని అలాగే పడమటి నర్సపురం లో ఉన్న ఆశ్రమ హాస్టల్ బాలికల వసతి గృహంలో సర్వే నిర్వహించామని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు జూలూరుపాడు మండలంలో 30 పడక ల ఆసుపత్రి అవసరమని ఆరోజు నిర్మాణం చేయడం జరిగిందని ఆంధ్ర పాలకులపై తెలంగాణ పాలకులు వచ్చిన నేటికీ అది 30 పడకల ఆసుపత్రికి పూర్తి కాలేదని ప్రస్తుతం కొనసాగుతున్న పిహెచ్సికి కావలసిన సిబ్బంది కొరత గా ఉన్నారు. మండలంలోని మధ్యతరగతి వారు పేదలు కనీసం150 నుండి 200 మంది ఓపి నడుస్తున్న జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన సిబ్బందిని నియమించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చేస్తుందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి జూలూరుపాడు ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన సిబ్బందిని నియమించాలని అలాగే పడమటి నర్సపురంలో ఉన్న బాలికల ఆశ్రమ హాస్టల్ నందు వర్షం వస్తే కనీసం స్నానం చేయటానికి విలుండే పరిస్థితి లేదని పాములు తరచూ వస్తా ఉన్నాయని బాలికల వసతి గృహంలో కనీస భద్రత లేకుండా ఉన్నందున హాస్టల్ అవసరమైన జనరేటర్ ని తక్షణమే ఏర్పాటు చేయాలి కరెంటు పోయిన హాస్టల్లో వెలుగులు నింపే విధంగా ప్రభుత్వ చర్యలు ఉండాలని ఈ సమస్యల పరిష్కరించాలని జరిగిన గ్రీవెన్స్ లో సిపిఎం పార్టీ జూలూరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి,ఓడల వెంకటేశ్వర్లు, బోడ అభిమిత్ర,గడిదేసి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

# 38 ఏళ్ల సేవా ప్రస్థానానికి ముగింపు

## దోమకొండ పీఏసీఎస్ సెక్రటరీ బాల్‌రెడ్డికి ఘన వీడ్కోలు....

**కామారెడ్డి జిల్లా ప్రతి నిధి దోమకొండ ఆగస్టు 31.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లా దోమకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సెక్రటరీగా పన్యాల బాల్‌రెడ్డి అందించిన 38 ఏళ్ల సుదీర్ఘ సేవలకు సోమవారం ముగింపు పలికారు. 1988లో క్లర్క్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం సెక్రటరీగా బాధ్యతలు చేపట్టి దోమకొండ పీఏసీఎస్‌లోనే పదవీ విరమణ పొందారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు రైతులు, సంఘ సభ్యులకు సేవలందిస్తూ పీఏసీఎస్ కార్యకలాపాల్లో కీలకపాత్ర పోషించారు. విధి నిర్వహణలో నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేసి సహచరులు, రైతులు, గ్రామస్తుల మన్ననలు పొందారు. పీఏసీఎస్ అభివృద్ధికి, రైతులకు



సేవలందించడంలో బాల్‌రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. పదవీ విరమణ సందర్భంగా పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో బాల్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఒకే ప్రాంతంలో 38 ఏళ్ల పాటు సేవలందించి పదవీ విరమణ పొందడం అరుదైన విషయమని, ఆయన అనుభవం, సేవా స్ఫూర్తి నేటి ఉద్యోగులకు ఆదర్శమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, జిల్లా క్లస్టర్




ఆఫీసర్ నగేష్, మాజీ జెడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, యూనియన్ లీడర్ సాలెన్, రావులపల్లి నర్సారెడ్డి, అంకత్ నర్సింలు, బుర్లింగం, కదిరి దుర్గారెడ్డి, నాగరపు రాములు, షేక్ మహమ్మద్, లింగం, రామ్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, నీరజ్‌రెడ్డి, అశోక్, ప్రభాకర్‌రెడ్డి, రమణి, నర్సింలు, వివిధ గ్రామాల సీఈవోలు, డైరెక్టర్లు, రైతులు, సహచరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నవీన్, ప్రమోద్‌రెడ్డి, మహాలింగం, గులాం, అంకత్ సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.



# భీమారంలో సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతుల (ఐపీఎం ) క్షేత్ర ప్రదర్శన మరియు శిక్షణా కార్యక్రమం

**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా ఆగస్టు 31 :** మంచిర్యాల జిల్లా వ్యవసాయ శాఖ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ – 2026--27 ఆధ్వర్యంలో చెన్నూర్ బ్లాక్ పరిధిలోని భీమారం మండలంలో "ప్రధాన పంటలలో సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులు (ఐపీఎం )" పై క్షేత్ర ప్రదర్శన మరియు రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భీమారం మండల వ్యవసాయ అధికారి అత్తె సుధాకర్ హాజరై మాట్లాడారు. పంటల్లో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు రసాయన మందుల వాడకాన్ని తగ్గించి, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం వల్ల సాగు ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు రైతులకు వివరించారు. ముఖ్యంగా చేనులో పక్షి తావడాలు (బర్డ్ పెర్చేస్ ) ఏర్పాటు చేయడం ద్వారా మిత్ర పురుగులు, పక్షులు రసం పీల్చే పురుగులను మరియు లార్వాలను సహజసిద్ధంగా తిని తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో బి.టి.ఎం, పరిసర ప్రాంతాల రైతులు పాల్గొని క్షేత్ర ప్రదర్శనను పరిశీలించారు.

# ముప్కాల్ ప్రజావాణికి 5 దరఖాస్తులు నమోదు



**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** ముప్కాల్ మండల కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుండి స్పందన లభించింది. నోడల్ అధికారి, ఎంపీడీవో బి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 5 దరఖాస్తులు నమోదయ్యాయి. రెవెన్యూ శాఖకు 3, ఎంపీఓ పంచాయతి రాజ్ శాఖకు 2, చొప్పున వినతులు అందాయి. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎంపీడీవో కోరారు.

# బాల్కొండ మండల కేంద్రంలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన కార్యక్రమం

**పోరు తెలంగాణ ప్రతినిధి (భూమేశ్వర్) :** రాష్ట్రంలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా రైతులను ఆయిల్ ఫామ్ సాగు వైపు మల్లించేందుకు విస్తృతంగా అవగాహన కల్పిస్తుంది. అందులో భాగంగా జిల్లా ఉద్యాన శాఖ ప్రీ యూనిక్ ఆయిల్ ఫామ్ కంపెనీ వారు సంయుక్తంగా మెగా ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాల్కొండ మండల కేంద్రంలో రైతు కాల గంగ నర్సయ్య 8 ఎకరాల్లో ఆయిల్ మొక్కలు నాటారు. ఇందులో భాగంగా డివిజనల్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్ మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతుకి ప్రభుత్వం నుండి సబ్సిడీ లో మొక్కలు అలాగే,డ్రిప్ పరికరాలు అందిస్తున్నారని,అంతేకాకుండా ఆయన ఫామ్ నాటుకున్న రైతులకు పంట యాజమాన్యం అంతర పంట నిర్వహణ కోసం ఎకరానికి 4200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాలు 16800 రూపాయలు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలోకి ప్రభుత్వం జమ చేస్తుందని వివరించారు.ప్రతి రైతు అపోహలు మానుకొని విరివిగా ఆయిల్ ఫామ్ సాగు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధి హైజాక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పాత ఇనుపసామాను దుకాణం తొలగించాలని ప్రజావాణిలో పిర్యాదు

**పోరు తెలంగాణ ప్రతినిధి// మెట్‌పల్లి :** జగిత్యాల జిల్లా మెట్ పల్లి మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులో జన నివాసాల మధ్య పాత ఇనుప సామాను కుప్పలుగా నిల్వ చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని,ఈ మేరకు సంబంధిత అధికారులకు దుకాణాన్ని తొలగించాలని ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.పాత ఇనుప సామాను ఇళ్ల గోడల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో కుప్పలుగా వేయడంతో పందికొక్కులు, ఎలుకలు, దోమలు, పాములు స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నాయని, పందికొక్కులు గుంతలు తవ్వడంతో ఇళ్లలోని టైల్స్ కుంగిపోతున్నాయని,పాములు ఇళ్లలోకి వస్తుండటంతో ప్రాణభయం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా రాత్రి వేళల్లో పాత ఇనుప సామాను తీసుకురావడం,తరలించడం జరుగుతుండటంతో కాలనీలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. దోమలు, ఎలుకలు, పందికొక్కుల బెడదతో ఆరోగ్య సమస్యలు కూడా ఎదురవుతున్నాయని అన్నారు.కావున 7వ వార్డులోని పాత ఇనుప సామాను దుకాణాన్ని సాధ్యమైనంత త్వరగా తొలగించి, కాలనీవాసులకు భద్రతతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని కాలనీ వాసులు అధికారులను కోరారు.




# ఘనంగా వనమహోత్సవం




**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా మెట్ పల్లిలో ఘనంగా వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నేషనల్ హైవే డివైడర్లలో మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం, పట్టణాన్ని పచ్చదనంతో కళకళలాడించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బొడ్ల ఆనంద్,నాయకులు కిషోర్,లింగేశ్వర్, డిఈ నాగేశ్వర్ రావు, సానిటరీ ఇన్స్పెక్టర్ సురేష్ నాయక్,ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు,ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణపై సమగ్ర పరిశీలన

**పోరు తెలంగాణ ప్రతినిధి // మెట్ పల్లి :** జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ రాములు సోమవారం వార్షిక తనిఖీలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించడంతో పాటు సిబ్బంది విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.వార్షిక తనిఖీలో భాగంగా కేసులకు సంబంధించిన ఫైల్స్, వివిధ రకాల రిజిస్టర్లు, రికార్డులు, ఇతర ముఖ్యమైన దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి స్టేషన్‌లో పరిశుభ్రతను పాటించాలని,ప్రజలకు అందించే పోలీస్ సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణ, అప్రమత్తతతో పనిచేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి, చట్టపరంగా సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు.శాంతిభద్రత ల పరిరక్షణ, నేరాల నియంత్రణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.వార్షిక తనిఖీ సందర్భంగా కోరుట్ల సిఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ శ్యామ్ రాజ్ తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# దోమకొండ మండల మహిళా సమాఖ్య నూతన పాలకవర్గం ఎన్నిక





**కామారెడ్డి జిల్లా ప్రతినిధి: ఆగస్టు 31.(పోరు తెలంగాణ న్యూస్:) :** దోమకొండ మండల మహిళా సమాఖ్య 19వ మహాజన సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎడ్ల రేణుక, కార్యదర్శిగా ముదసాని స్వప్న, కోశాధికారిగా పోతుల శారద ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులకు సమావేశంలో అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం జి. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్, సీబీఓ ఆడిటర్ రామచంద్ర గౌడ్, సీసీలు వెంకట రాజా గౌడ్, కృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్, అకౌంటెంట్ స్వాతితో పాటు అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

# సాదాసీదాగా ప్రజావాణి



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 10 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో అనిల్‌రెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయానికి 2, రెవెన్యూ శాఖకు 2, ఆర్‌అండ్‌బీ శాఖకు 2, పోలీస్‌శాఖకు 1, ఎక్సైజ్‌శాఖకు 1, నీటిపారుదల శాఖ ఏఈకి 1, ఓదెల వైద్యాధికారికి 1 దరఖాస్తు వచ్చినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీటీ, తహసీల్దార్, వ్యవసాయ అధికారి భాస్కర్, ఎంఈఓ రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యలను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని సూచించారు.

## సంచార అర్ధ సంచార జాతుల విముక్త దినోత్సవం



**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా ఆగస్టు 31 :** మంచిర్యాల సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం( కలెక్టర్ భవనం) లోని జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి కార్యాలయంలో సంచార అర్ధ సంచార జాతుల విముక్త దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం బీసీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వరి అధ్యక్షతనలో సంచార జాతుల వివిధ కులాల నాయకుల ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డిఎన్టి - కోఆర్డినేటర్- తాళ్ల వేణు గోత్రాల, వైద్య భాస్కర్ బుక్కయ్య వారు, కృష్ణ వడ్డెర, గందె శ్రీ తిరుపతి గోత్రాల, పి క్రాంతి కుమార్ కునపులి, కడారి సాగర్ వీరబద్రియ, జక్కుల సమ్మయ్య- రాజన్నల, తిరుపతి పూసల, మరియు సంచారజాతుల కుల నాయకులు పాల్గొన్నారు.

# ఓదెలలో రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

### సర్పంచ్ కనికి రెడ్డి సతీష్ ఆధ్వర్యంలో




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఆగస్టు 31 సోమవారం ఓదెల గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ కనికిరెడ్డి సతీష్ , ఉప సర్పంచ్ పాలకవర్గంతో కలిసి సోమవారం రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకట లక్ష్మణ్, జిపిఓ కిషన్ ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు



**పోరు తెలంగాణ, మంచిర్యాల,ఆగష్టు 31 :** భీమారం మండలం,మద్దికల్ గ్రామ పంచాయతీ లో హనుమాన్ గుడి దగ్గర ఉన్న ట్రాన్సఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తీగలను సర్పంచ్ పోతేం సమ్మయ్య వర్కర్స్ తో తొలగించారు. ట్రాన్స్ఫారం చుట్టూ చెట్లు, చెట్ల కొమ్మలు, తీగలు అడ్డు రావడంతో కరెంటు కి అంతరాయం ఏర్పడుతుంది అని సర్పంచ్ సమస్య పునరావృతం కాకుండా చెట్ల కొమ్మలను తొలగించారు.

# కనగర్తిలో పౌర హక్కుల దినోత్సవం




**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా ఆగస్టు 31 సోమవారం ఓదెల మండలం కనగ ర్తి భగత్ సింగ్ నగర్ పరిధిలోని ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ జాతి ,కులం ,మతం, వివక్షత లేకుండా అందరూ సమానులే అనే ఆలోచన కలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చొప్పరి సంధ్యారాణి, రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ ,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ లు గ్రామ పంచాయతీ కార్యదర్శి , గ్రామ ప్రజలు హాజరైనారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### వెయ్యి రోజులలో ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు..

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి..



**మహేశ్వరం, ఆగస్టు 31, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని మాజీ మంత్రి, నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్త పరిచారు.సోమవారం మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం కార్యక్రమాలు, సభలు, ప్రచార కార్యక్రమాలతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. ప్రజలు మాత్రం తమ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటని ఆమె ప్రశ్నించారు. రైతులకు బీమా, రైతు సంక్షేమం పేరుతో హామీలు ఇచ్చినప్పటికీ వాటి అమలులో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. రైతు కుటుంబానికి అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుడంలో విఫలమైందని విమర్శించారు. అదేవిధంగా కార్మికులు, పేదలు, మహిళలు, నిరుద్యోగులు, గ్రామీణ ప్రజలు సహా వివిధ వర్గాలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని అన్నారు. హామీల అమలుకు స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించాలని ఆమెడిమాండ్ చేశారు. గతంలో ప్రజల అవసరాలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సేకరించి, సంబంధిత అధికారులకు అందించి, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి చేరేలా కృషి చేశామని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తోందని అన్నారు.ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఓట్లు పొందిన తర్వాత వాటిని మరిచిపోవడం ప్రజలను మోసం చేయడమే అని ఆమె మండిపడ్డారు. ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజేయడానికి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వాటి ప్రస్తుత పరిస్థితిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం సభలు, సమావేశాలు నిర్వహించడం కాకుండా ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని ఆమె సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో ప్రభుత్వం ప్రజల ముందుంచాలని అన్నారు.ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు ప్రభుత్వంపై ప్రశ్నిస్తూనే ఉంటామని, ప్రజల తరఫున పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.

# అసత్య ప్రచారాలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టండి

### భాజాపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా ఆగస్టు 31 :** మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్య ప్రచారాలు మానేసి చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు నేషనల్ హైవే నెంబర్ 63 జోడు వాగుల సమీపంలో భాజపా కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.. రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న జోడు వాగుల బ్రిడ్జి నిర్మాణం పనులను కేంద్ర ప్రభుత్వం 120 కోట్ల రూపాయలు విడుదల చేసి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేసిందని అటవీ అనువాతులను సైతం ఇప్పించిందని త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం అవుతున్ననేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోడు వాగుల వద్ద మంత్రి ఆదేశాల మేరకు ధర్నా నిర్వహించడం సిగ్గుచేటని వారికి అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి ఉంటే చెన్నూరు పట్టణంలో ఎలాంటి ఎస్టిమేషన్లు టెండర్ ప్రక్రియ లేకుండా మెయిన్ రోడ్ లో 200 ఇండ్లు కూల్చివేశారని.. కనీసం ఆ పనులు కూడా ప్రారంభించలేదని కోటి రూపాయలతో ప్రారంభిస్తామన్న వైకుంఠధామం పనులు బైనాక్యులర్లలో చూసిన కనిపించడం లేదని ఇందిరమ్మ గృహాల పంపిణీలో అవినీతి జరుగుతుందని సాక్షాత్తు మంత్రి వీడియో విడుదల చేశారని.. వీటన్నింటి నుంచి దృష్టి మళ్లించడానికి జోడు వాగుల బ్రిడ్జి నాటకం ఆడుతున్నారని ఆయన విమర్శించారు.... కేంద్ర ప్రభుత్వం జోడు వాగుల పనులు ఆపితే టెండర్ ప్రక్రియ ఎందుకు పూర్తి చేశారని కనీస పరిజ్ఞానం కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేకపోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గర్రెపల్లి శాంత వెంకట నరసయ్య పెగడపల్లి సర్పంచ్ రాము జైపూర్ మండల పార్టీ ఇంచార్జ్ మంత్రి రామయ్య చెన్నూరు మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్ చెన్నూరు పట్టణ ప్రధాన కార్యదర్శులు కాగిత వెంకటేష్ మాణిక రైతు శంకర్ సీనియర్ బిజెపి నాయకులు కొండపాక చారి భీమారం మండల అధ్యక్షులు బోర్లకుంట శంకర్ చెన్నూరు పట్టణ నాయకులు తుమ్మ చిరంజీవి తలారి రాజులు కొత్తూరీ దుర్గాప్రసాద్. రమేష్.. భాజపా కార్యకర్తలు

# జైపూర్ లో ప్రజావాణి నిర్వహణ





**పోరు తెలంగాణ మంచిర్యాల జిల్లా, ఆగస్టు 31 :** జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం రెండు ఫిర్యాదులు అందగా వాటిలో రెవెన్యూ శాఖకు (02)ఫిర్యాదులు వచ్చాయి.సంబంధిత శాఖల అధికారులు ఫిర్యాదులను స్వీకరించి,వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీపతి బాపు రావు మాట్లాడుతూ..మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని,తమ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజావాణిలో సమర్పించి పరిష్కారం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీపతి బాపు రావు,మండల డిప్యూటీ తహసీల్దార్ జే.సంతోష్ కుమార్,మండల వ్యవసాయ అధికారి సైదా,మెడికల్ ఆఫీసర్ జైపూర్ డాక్టర్ ముస్తఫా,జైపూర్ ఎస్సై వి.రామలక్ష్మి,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఏ.వెంకటేష్,ఏఈ పిఆర్ బి.రాజ్ కుమార్,ఏఈ హౌసింగ్ కాంక్ష,ఏఈ ఆర్డబ్ల్యూఎస్ ఎన్.రాజమలయ్య,మండల్ లెవెల్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎం.కళ్యాణి,ఐసిడిఎస్ సూపర్వైజర్ గాయత్రి,ఏపీవో బి.బాలయ్య,ఏపీఎం ఐకెపి సిహెచ్ సంతోష్,ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.వసంత లక్ష్మి,ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి.శంకర్,మండల బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ.సుధా లక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజలు ఇచ్చిన అర్జీల పై న్యాయం జరిగేదెప్పుడో?

### నెలలు దాటినా కూడా పరిష్కారానికి నోచుకోవటా?

### బి పట్టించుకునే వారేరి?




**పోరు తెలంగాణ, ధర్మారం ఆగస్టు 31 :** ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలొ వివిధ సమస్యల గురించి ప్రజలు ఇచ్చిన ఆర్జీలతొ పాటు పై అదికారులకు ఇచ్చిన ఆర్జీలపై న్యాయం చేయాలంటూ నెలల తరుబడి తిరిగినా ఎలాంటి న్యాయం జరుగడం లేదని ప్రజలు వాపొతున్నారు.ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి నెలల వారిగా వచ్చిన ఆర్జీలపై తీసుకున్న చర్యలు, పెండింగ్లో ఉంచడానికి గల కారణాల వివరాలను అడిగి తెలుసుకుని అధికారులకు ఇచ్చిన ఆర్జీలపై త్వరితగతిన చర్యలు తీసుకునే విధంగా ఉన్నత అదికారులు స్పందించి ఆర్జీ దారులకు త్వరితగతిన న్యాయం చేకూరులే చర్యలు తీసుకోవాలని పలువురు వేడుకుంటున్నారు.

## అసెంబ్లీ లైబ్రరీ కమిటీ ప్రాథమిక సమావేశంలో పాల్గొన్న పాల్వాయి హరీష్ బాబు




**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** హైదరాబాద్ అసెంబ్లీ ప్రాంగణంలోని శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్‌లో అసెంబ్లీ లైబ్రరీ కమిటీ ప్రాథమిక సమావేశం జరిగింది. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, లైబ్రరీ కమిటీ చైర్మన్ మట్టా రాగమయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కమిటీ సభ్యునిగా పాల్గొన్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అసెంబ్లీ లైబ్రరీని పునరుద్ధరించాలని, సభ్యులకు మెరుగైన లైబ్రరీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. హైదరాబాద్‌లోని స్టేట్ లైబ్రరీ, జిల్లా గ్రంథాలయ సంస్థ లైబ్రరీలు, శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బొగ్గారపు దయానంద్, దేశపతి శ్రీనివాస్, ఎంఐఎం సభ్యుడు మీర్ జుల్ఫికర్ అలీ, శాసన మండలి కార్యదర్శి నరసింహ చార్యులు, శాసన సభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## 22 ఎ భూముల విషయంలో ఆదారాలతొనె నిర్ణయాలు తీసుకొవాలి - జిల్లా కలెక్టర్





**పోరు తెలంగాణ పెద్దపల్లి ఆగస్టు 31 :** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అధనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి 22 ఎ నిషేధిత భూముల జాబితా పై రెవిన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఎ భూములకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వస్తున్న ఫిర్యాదులు, భూముల రికార్డుల పరిశీలన , జాబితాలో చేర్చడం, తొలగింపు ప్రక్రియ, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

## చెక్కు బౌన్స్ కేసులో నిందితులకు ఏడాది జైలు శిక్ష ఖరారు



**పోరు తెలంగాణ,ఖమ్మం, ఆగస్టు 31:** ఖమ్మం జిల్లా కోర్టు తీర్పు ఖమ్మం లీగల్: కుటుంబ అవసరాల నిమిత్తం తీసుకున్న అప్పుకు సంబంధించిన చెక్కు బౌన్స్ అయిన కేసులో నిందితులకు విధించిన శిక్షను ఖమ్మం జిల్లా కోర్టు స్థిరీకరించింది. కేసు వివరాల్లోకి వెళితే.. ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ 10వ డివిజన్‌కు చెందిన కొప్పుల నరసింహారావు, కొప్పుల సుభద్ర దంపతులు తమ కుటుంబ అవసరాల కోసం ఫిర్యాదుదారుడైన దురిశెట్టి వెంకన్న (S/o s eTT\T) వద్ద నుండి రూ. 22,00,000/- (ఇరవై రెండు లక్షల రూపాయలు) అప్పుగా తీసుకున్నారు.ఆ మొత్తానికి బదులుగా వారు జారీ చేసిన చెక్కు బ్యాంకులో చెల్లకపోవడంతో (Cheque Bounce) దురిశెట్టి వెంకన్న కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన దిగువ కోర్టు (S.T.C.No.76/2024), నిందితులకు ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్షతో పాటు, రూ. 22,00,000/- పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది.ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితులు ఖమ్మం జిల్లా కోర్టులో అప్పీల్ (Crl.A.No.15/2026) దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన గౌరవ I అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి వాసుకుల సీనయ్య గారు నేడు (31-08-2026) నిందితుల అప్పీల్‌ను కొట్టివేశారు. దిగువ కోర్టు విధించిన ఒక సంవత్సరం జైలు శిక్ష మరియు రూ. 22 లక్షల పరిహారాన్ని యథాతథంగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒకవేళ నిందితులు ఆ పరిహార మొత్తాన్ని చెల్లించని పక్షంలో, అదనంగా మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు

## హరిపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** ఓదెల మండలం, హరిపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి రూ. 5 లక్షల నిధులతో మంజూరుతో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వవిప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపు నారాయణరెడ్డి, పెద్దపెల్లి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ గ్రామ ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు, మహిళాలు తదితరులు పాల్గొన్నారు...

# రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

## పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కార్యవర్గ సభ్యులు



**పోరు తెలంగాణ పెద్దపల్లి ఆగస్టు 31 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి, అదనపు డీసీపీ కె.శ్రీనివాస్,ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్ర గౌడ్,రమేష్,ఏఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో,స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ భీమేష్,ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్నికల ప్రక్రియ, ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ ఎన్నికల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 70 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ వడ్లకొండ నవీన్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాంచందర్‌పై 5 ఓట్ల ఆధిక్యంతో రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

**నూతన కార్యవర్గం:**

అధ్యక్షుడు: వి. నవీన్ కుమార్, పోలీస్ కానిస్టేబుల్ 291, శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్

ఉపాధ్యక్షులు: ఎన్. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, సైబర్ క్రైమ్ విభాగం; ఎం. తిరుపతి, ఏఎస్ఐ, పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్

ప్రధాన కార్యదర్శి: జె. అంజనేయులు, సబ్‌ఇన్‌స్పెక్టర్, సీసీబీ రామగుండం

సంయుక్త కార్యదర్శి: కె. ఓంకార్, కానిస్టేబుల్, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్

సంస్థాగత కార్యదర్శి: డి. వినోద్ బాబు, కానిస్టేబుల్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్

కోశాధికారి: టి. సుందర్ సింగ్, కానిస్టేబుల్, ధర్మారం పోలీస్ స్టేషన్

**కార్యనిర్వాహక సభ్యులు:**

ఎం.డి. రిజ్వాన్ షా ఖాన్, హెడ్ కానిస్టేబుల్ 714, సీఎస్బీ రామగుండం;

డి. అనిల్ కుమార్, కానిస్టేబుల్, బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్;

సి.హెచ్. దేవరాజ్, కానిస్టేబుల్, సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్

కార్యవర్గ సభ్యులు: ఎం. రజిత, మహిళా పోలీస్ కానిస్టేబుల్, పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్; ఎ. కపిల్, ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్, సీఏఆర్ రామగుండం; డి. రాజం, ఏఆర్ఎస్ఐ, సీఏఆర్ బెల్లంపల్లి ఎన్నికల్లో విజయం సాధించిన నూతన పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని మొక్కలను అందజేశారు.ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం విజయం సాధించిన అభ్యర్థులకు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అధికారికంగా ఎన్నికల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన రామగుండం కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘం ప్రతినిధులు తక్షణమే స్పందించాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి,వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.పోలీస్ అధికారుల సంఘం సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ,వారి సంక్షేమం కోసం కృషి చేయాలని సీపీ ఆకాంక్షించారు. సంఘం బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేస్తూ పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు





**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 31, 2026:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో అధికారులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణానికి చెందిన మోటూరి శ్రీనివాస్ లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దండేపల్లి మండలం మేదరిపేట గ్రామానికి చెందిన సిద్ధి మల్లేష్ తమకు చెందిన భూమి ఇతరుల పేరిట అక్రమంగా పట్టా మార్పు జరిగిందని, ఇట్టి పట్టా రద్దు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ళకు చెందిన ఆవుల వెంకటేశం తనకు గ్రామ శివారులో ఉన్న భూమికి పట్టాదారు పాసు పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ తమ గ్రామపంచాయతీలో మురుగు కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులతో సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 31, 2026:** ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి.చందయ్య తో కలిసి కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, సి. ఆర్.పి. లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, తల్లితండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకంతో ప్రభుత్వ పాఠశాలలలో చేరుస్తున్నారని తెలిపారు. జిల్లాలో సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటు ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి రోజు అల్పాహారం అందించడంతో ప్రభుత్వ పాఠశాలలలో హాజరు శాతం తప్పకుండా పెరుగుతుందని తెలిపారు. పిల్లలు అభ్యాసన సామర్థ్యం పెంచే బాధ్యత విద్యాధికారులు, ఉపాధ్యాయులదే అని, త్వరలో జిల్లాలో విద్యార్థుల హాజరు, నేర్చుకునే సామర్థ్యం తదితర అంశాలతో యాప్ ఏర్పాటు చేసి వారాంతపు నివేదికలు సేకరించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మల్టీ గ్రేడ్/ మల్టీ లెవెల్ టీచింగ్ అమలు చేయాలని,మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తరచూ పాఠశాలను సందర్శించి విద్యార్థుల పోటీతత్వం ఆధారంగా, తరగతుల విభజన, సీటింగ్ పొజిషన్ సక్రమంగా చేయాలని తెలిపారు. పాఠశాల సందర్శన సమయంలో విద్యార్థులతో మాట్లాడాలని, సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని, సరైన టీచింగ్- లర్నింగ్ మెటీరియల్ ద్వారా ఎఫ్.ఎల్.ఎన్. శాతాన్ని పెంపొందించాలని తెలిపారు. విద్యార్థులను నిశితంగా పరిశీలించడం, ఉపాధ్యాయులతో విద్యార్థులు సామర్థ్యాల గురించి సమీక్షించడం, తరగతుల ప్రణాళిక పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సంబంధిత కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ పై అవగాహన కలిగి ఉండాలని, పాఠశాలలను తరచూ సందర్శించాలని తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని, అవసరం మేరకు వసతులు కల్పించడం జరుగుతుందని, విద్యార్థుల పఠన శక్తిని వృద్ధి చేసి నేర్చుకునే సామర్థ్యం పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1వ తేదీన జిల్లాకు ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 31, 2026:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీన జిల్లాకు ఎలక్ట్రోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగితా రానా రానున్నారని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10:30 గంటలకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈ.ఆర్.ఓ.లు, ఎ.ఈ.ఆర్.ఓ./తహసిల్దార్లతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో స్వీకరించిన ఫిర్యాదులు, అభ్యంతరాలు, 1 నుండి 8 నమూనాలలో నియోజకవర్గం/ మండలాలకు చెందిన 9, 10, 11, 11ఎ ఫారములు, పూర్తి వివరాలతో సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

# విద్యకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి








## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**పోరు తెలంగాణ మంచిర్యాల,ఆగస్టు 31, 2026:** ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటుచేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, సింగరేణి సంస్థ అధికారులు బుద్ధ ప్రకాష్, రాధాకృష్ణ, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్య చంద్ర దాస్, కాంతయ్యదాస్, వ్యవసాయ కమిటీ చైర్మన్ భానేష్, కార్పొరేటర్లు చిలువేరు జ్యోతి, శేరు శ్రీలక్ష్మి లతో కలిసి ప్రారంభించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం పద్మనాయక ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రవేశపెట్టి, విద్యార్థులకు అల్పాహారం అందించి ఏకాగ్రతతో విద్యను అభ్యసించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని, ప్రీ ప్రైమరీ పాఠశాల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా సింగరేణి సంస్థ 8 కోట్ల రూపాయల సి.ఎం.ఆర్. నిధులను అందించడం అభినందనీయమని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ఈ విద్యా సంవత్సరం 7 శాతం విద్యార్థుల నమోదు పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల నుండి దాదాపు 4 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరారని, వచ్చే విద్యా సంవత్సరంలో మరింత పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ కొడంగల్, మధిర, మంథని తరువాత మంచిర్యాలలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ కిచెన్ నిర్వహణ బాధ్యతలు చేపట్టి జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల పరిధిలో 691 ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న 42 వేల 450 మంది విద్యార్థులకు, 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో చదువుతున్న 6 వేల 654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పరిశుభ్రమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ అమలు భాగస్వామిగా వ్యవహరిస్తుండగా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా కిచెన్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన సుమారు 12 వేల చదరపు అడుగుల షెడ్‌లో ఈ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించడం జరిగిందని, ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను అత్యున్నత స్థాయిలో నిర్వహించేందుకు ఫుడ్ ల్యాబ్, మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్, ఆర్.ఓ. వాటర్ ప్లాంట్, బాయిలర్ ప్లాంట్, సెంట్రల్ గ్యాస్ బ్యాంక్, ఆటోమేటిక్ వెజిటబుల్ వాషింగ్ అండ్ కటింగ్ యూనిట్ వంటి ప్రత్యేక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, జన్నారం, మందమర్రి, లక్సెట్టిపేట, దండేపల్లి, కాసిపేట, నెన్నెల, హాజీపూర్, నాస్పూర్, భీమారం మండలాలు, జగిత్యాల జిల్లాలోని వెల్లటూరు, ఎండపల్లి మండలాలు, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థులు ఉదయం పూట ఆకలితో పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వెళ్లకుండా ఆరోగ్యకరమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం తీసుకుని ఉత్సాహంగా విద్యను అభ్యసించేలా చేయడం స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాం ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల నమోదులో మంచిర్యాల రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచిందని ప్రథమ స్థానంలో నిలిచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు రాష్ట్రంలోని అత్యున్నతంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిపై దాదాపు 27 వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని, ఈ చర్యలతో ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని, జిల్లా కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధి మాట్లాడుతూ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా ఈ ప్రాంతంలో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు ప్రతి ఉదయం సకాలంలో వేడిగా అల్పాహారం అందించేందుకు అక్షయపాత్ర ఫౌండేషన్ తో కలిసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కిచెన్‌లో ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ స్టీమర్లతో గంటకు 5 వేల 400 ఇడ్లీలు, ఆటోమేటిక్ దోశ మెషీన్‌తో గంటకు 2 వేల దోశలు, ఆటోమేటిక్ పూరీ మెషీన్‌తో గంటకు 3 వేల పూరీలు, సాంబార్, కూరల తయారీ యూనిట్ల ద్వారా 2 గంటలలో 5 వేల మంది విద్యార్థులకు సరిపడా ఆహారం, రైస్ కుకింగ్ పరికరాల ద్వారా కేవలం 15 నిమిషాలలో 1 వేయి మందికి సరిపడా అన్నం తయారు చేసే సామర్థ్యం ఉందని తెలిపారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, ఏకాగ్రత, విద్యాభ్యాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపుగా 4 లక్షల మంది విద్యార్థులకు అందించడం జరుగుతుందని, ఇందులో సుమారు 20 శాతం సింగరేణి సంస్థ నిధులతో సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించేందుకు ఫౌండేషన్ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తుందని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని గోదావరి తీరంలో పుష్కర ఘాట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు -2027లో భాగంగా జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో పుష్కర ఘాట్, గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి, రహదారుల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. టైర్ 2 లో లక్షెట్టిపేటలో పుష్కర ఘాట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించడం జరిగిందని, ఏర్పాట్లకు అవసరమైన నిధులు సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని పుష్కర ఘాట్ల వద్ద సుమారు 6 లక్షల మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు.. పుష్కర ఘాట్ల ఏర్పాటుకు గాను ప్రభుత్వం 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, ప్రజలకు అవసరమైన ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ ఈరోజు మంచిర్యాల జిల్లాలో చారిత్రాత్మకమైన ఘట్టాలు చోటు చేసుకున్నాయని, ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించేందుకు సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించడం జరిగిందని, గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేసేందుకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాలలో రాష్ట్రంలో ప్రథమంగా శంకుస్థాపన చేయడం జరిగిందని, ఏర్పాట్లకు గాను 12 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, జిల్లాలోని మిగతా ఘాట్లకు 16 కోట్ల 70 లక్షల రూపాయలు, గూడెంలో పుష్కర ఘాట్ ఏర్పాటుకు 9 కోట్ల 50 లక్షల రూపాయలు, 58 కోట్ల రూపాయలతో గూడెంలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయం, మంచిర్యాలలోని శ్రీ విశ్వనాథ ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులకు మూత్రశాలలు, బట్టలు మార్చుకునే గదులు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాదాపు 20 లక్షల నుండి 25 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పోలీస్, మున్సిపాలిటీ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఫీల్డ్ అసిస్టెంట్ల ఉద్యోగ సంఘం

వేల్పుల మల్లయ్య ఆధ్వర్యంలో



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపెల్లి జిల్లా వివిజి రాంజీ ఫీల్డ్ అసిస్టెంట్ ల ఉద్యోగ సంఘం అధ్యక్షులు వేల్పుల మల్లయ్య ఆధ్వర్యంలో పెద్దపల్లి శాసనసభ్యులు ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు ని మర్యాదపూర్వకంగా కలిసి పూల బోకే అందించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి ఇండ్ల రమేష్ వైస్ ప్రెసిడెంట్ గడ్డం శారద సహాయ కార్యదర్శి మామిడిపల్లి సాగర్ ,ఏదుల రవి ముఖ్య సలహాదారులు రెడ్డి నవీన్ కుమార్ వివిధ గ్రామాలఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## రహదారి ప్రమాదాలు నివారించేందుకు రక్షణ చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత.....





**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కె.హరిత రహదారి భద్రతపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సిర్పూర్‌టి మండలం వెంకట్రావుపేట వద్ద గల అంతర్రాష్ట్ర వంతెనపై భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రహదారి భవనాల శాఖల ఆధీనంలోని రహదారుల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. జాతీయ రహదారులపై సీసీ కెమెరాలు, వేగనియంత్రిక బోర్డులు ఏర్పాటు చేసి అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని జాతీయ రహదారుల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించాలని, రహదారులపై పశువులు సంచరించకుండా చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా తనిఖీలు నిర్వహించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

## విద్యార్థులలో పునాది అక్షరాస్యత సంఖ్యా పరిజ్ఞానం పెంపొందించాలి

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్....



**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం జనకాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ సందర్శించారు. ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాల అమలును పరిశీలించడంలో భాగంగా పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయిలు, బోధనా-అభ్యసన ప్రక్రియలు, చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, సంఖ్యా పరిజ్ఞానం వంటి అంశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలలో ఎఫ్.ఎల్.ఎన్. లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వినూత్న బోధనా పద్ధతులు అవలంబించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రీడింగ్ కార్నర్, లైబ్రరీ వినియోగం ద్వారా విద్యార్థుల్లో పఠన అలవాట్లను పెంపొందించాలని, ప్రతి విద్యార్థి తన తరగతి స్థాయికి అనుగుణంగా చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిగత అభ్యసన స్థాయిలను గుర్తించి, అవసరమైన వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఉమ బాల, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత....



**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ కె.హరిత మండల సర్వేయర్లతో రీసర్వే ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీలు లేని గ్రామాల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను జిల్లాలో పకడ్బందీగా, త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో రైతుల మధ్య భూ వివాదాలు తలెత్తకుండా సర్వేలో డీజీపీఎస్, రోవర్స్‌లను వినియోగించాలని, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సహకారం తీసుకోవాలని సూచించారు. సర్వే చేసే ముందు రోజు రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియ చేపట్టాలని, సర్వే ఉద్దేశాన్ని రైతులకు వివరించి ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు.

## విముక్త జాతుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

జిల్లా కలెక్టర్ కె.హరిత.....



**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విముక్త జాతుల దినోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.హరిత హాజరయ్యారు. అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు ఆమెతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో విముక్త జాతుల సంక్షేమం, విద్య, వైద్యం, అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. వారికి గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేయడంతో పాటు పిల్లల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రిటిష్ కాలంలో క్రిమినల్ ట్రైబ్స్ చట్టం ద్వారా నిర్బంధానికి గురైన ఈ జాతులను స్వాతంత్ర్యానంతరం డి-నోటిఫైడ్ ట్రైబ్స్ చట్టం ద్వారా విముక్త జాతులుగా గుర్తించినట్లు వివరించారు. విముక్త జాతుల సాంప్రదాయ వృత్తులు, కళలు, జానపద ప్రదర్శనలు తెలంగాణ సంస్కృతికి విలువైన సంపదగా పేర్కొన్న కలెక్టర్, ప్రతి విద్యార్థికి విద్య, యువకులకు నైపుణ్యం, ఉపాధి, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించేందుకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి సాంప్రదాయ కళలు, సంస్కృతిని కాపాడుతూ, హక్కులను పరిరక్షించాలని కోరారు.

# కామారెడ్డిలో ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి: జిల్లా లిఎస్పీ ఎం. రాజేష్ చంద్ర

గతేడాది ఘటనలు పునరావృతం కాకూడదు .. భద్రతకేలి ప్రథమ ప్రాధాన్యతలి

మండలాల్లో సీసీ కెమెరాలు,

రాత్రి వేళల్లో నిఘా తప్పనిసరిలిలి

డీజేలకు అనుమతి లేదు..

వదంతులు నమ్మొద్దని హెచ్చరిక ...




**కామారెడ్డిజిల్లా ప్రతి నిధి:ఆగస్టు 31.(పోరు తెలంగాణ న్యూస్:) :** కామారెడ్డి జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అత్యంత ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర పిలుపునిచ్చారు. కామారెడ్డి కళాభారతీ ప్రాంగణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, శోభాయాత్రలపై వివిధ శాఖల అధికారులు మరియు ఉత్సవ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అయిన గణేష్ పండుగ ప్రజలందరికీ ఆనందాన్ని పంచాలని, గతేడాది మాచారెడ్డి, కామారెడ్డి ప్రాంతాల్లో జరిగిన విద్యుత్ ప్రమాదాల విషాదాలు ఈసారి పునరావృతం కారాదని స్పష్టం చేశారు. ఒక్క ప్రాణం కూడా కోల్పోకుండా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాకుండా పూర్తి భద్రతతో ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్సవ నిర్వాహకులు పాటించాల్సిన కీలక మార్గదర్శకాలు: రవాణా - విద్యుత్ భద్రత: విగ్రహాలను తరలించే సమయంలో ఎత్తు, రహదారిపై ఉన్న విద్యుత్ తీగలను పరిశీలించుకోవాలి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిపుణుల ఆధ్వర్యంలో సురక్షితమైన విద్యుత్ వైరింగ్ ఏర్పాటు చేసుకోవాలి. మండపాల నిఘా: ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలి. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రతి మండపం వద్ద సీసీటీవీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి వేళల్లో నిర్వాహకులు కాపలా ఉండాలి. అగ్ని ప్రమాద నివారణ: దీపాలు, ప్రమిదలు వెలిగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్టింగ్విషర్లు లేదా నీటి బకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి. నిబంధనలు - ఆంక్షలు: ఉత్సవాల్లో డీజేల వినియోగానికి ఎటువంటి అనుమతి లేదు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, అసభ్యకర కార్యక్రమాలు లేదా ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలకు దూరంగా ఉండాలి. సోషల్ మీడియా అప్రమత్తత వాట్సాప్, సోషల్ మీడియాలో వచ్చే రెచ్చగొట్టే వదంతులు, దురుద్దేశపూర్వక సందేశాలను నమ్మవద్దు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి. "భక్తి మన బలం.. భద్రత మన బాధ్యత" అనే నినాదంతో పోలీస్ శాఖకు, అన్ని శాఖల అధికారులకు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించి గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు ఎస్పీ కె. నరసింహారెడ్డి, డీఎస్పీలు మధుసూదన్, శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లు గుర్తింపు సంఘం ఎన్నికల కోసం ప్రజాప్రతినిధులు కలిసి రావాలి

జేఏసీ నాయకుడు గోలెం వెంకటేశం డిమాండ్.....





**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించడం ద్వారానే కార్మికులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కార్మికుల పోరాటానికి మద్దతుగా కలిసి రావాలని జేఏసీ నాయకుడు గోలెం వెంకటేశం డిమాండ్ చేశారు.సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష 104వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా రిలే నిరాహార దీక్షలో కూర్చున్న కొత్తకొండ రాజేష్‌కు గోలెం వెంకటేశం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికల ద్వారానే కార్మికుల హక్కులకు పూర్తి స్థాయిలో రక్షణ లభిస్తుందని అన్నారు. కమిటీల ద్వారా ఎలాంటి ఒప్పందాలు జరిగినా కార్మికులకు న్యాయం జరగదని, ఎన్నికల ద్వారా ఏర్పడే గుర్తింపు సంఘం మాత్రమే కార్మికుల హక్కులను సమర్థవంతంగా పరిరక్షించగలదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మిల్లు కార్మికులందరూ విశ్వసిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న అదిలాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ దండే విఠల్ కార్మికుల సమస్యపై ప్రత్యేక చొరవ తీసుకుని కార్మిక శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. యాజమాన్యాన్ని ఒప్పించి హైకోర్టులో ఉన్న కేసులను ఉపసంహరించుకునేలా చర్యలు తీసుకోవాలని, కార్మికుల పక్షాన నిలబడి పోరాటానికి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్థానిక బిజెపి పార్టీ నుండి గెలిచిన సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని గోలెం వెంకటేశం డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కార్మికులకు న్యాయమైన అగ్రిమెంట్ చేయిస్తామని, బయటి నుంచి వచ్చిన కార్మికుల సమస్యను పరిష్కరిస్తామని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, కార్మికుల హక్కులను పరిరక్షిస్తామని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కార్మికులు వారి కుటుంబాల మద్దతుతో ఎన్నికలలో గెలిచిన అనంతరం కార్మికుల సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరించాల్సిన ప్రజాప్రతినిధులు ఇప్పుడు యాజమాన్యంతో ఒప్పందాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఇద్దరు కలిసి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి యాజమాన్యం పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. హైకోర్టులో యాజమాన్యం దాఖలు చేసిన పిటిషన్ ఉపసరించుకునేలా చర్యలు చేపట్టి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియ సుజావుగా జరిగేందుకు పూర్తి సహకారం అందించాలని గోలెం వెంకటేశం డిమాండ్ చేశారు. 104 వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన వారిలో జేఏసీ నాయకులు బింగి రమేష్ బాబు, కల్లూరి శ్రీనివాస్, వడ్డేపల్లి రాజు, నస్పూరి శ్రీనివాస్, మధునయ్య, కనకాచారి, జానకిరామ్, బి. మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య వ్యాపారీకరణను అరికట్టాలి

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి



**పోరు తెలంగాణ, కరీంనగర్ ఆగస్టు 31 :** విద్యను అంగడి సరుకుగా మార్చే విధానాలను స్వస్తి చెప్పి, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని డెమోక్రటిక్ ఆల్ టీచర్స్ అసోసియేషన్ (డీఎటీఎ) డిమాండ్ చేసింది. ఆదివారం కరీంనగర్ లోని తారక హోటల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.డా.మహమ్మద్ మోహినుద్దీన్ మాట్లాడారు. ?తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది కానీ, నాణ్యమైన ఉచిత విద్యను అందించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రైవేట్ విద్యాసంస్థలతోనే నాణ్యత దొరుకుతుందనే నెపంతో విద్యా వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పజెప్పడం వల్ల ఉన్నత వర్గాలకే మేలు జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ప్రమాణాలు లేకపోవడం వల్ల ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 75 శాతం మందికి నైపుణ్యాలు లేక ఉద్యోగాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ?రాష్ట్రంలోని 11 ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఉన్న మొత్తం విద్యార్థుల సంఖ్య కంటే, ఒక్క మల్లా రెడ్డి ప్రైవేట్ విద్యాసంస్థలోనే అంతకు పైగా అనగా 75 వేల మందికి పైగా విద్యార్థులు ఉండటం విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది సింగిల్ టీచర్ విద్యాసంస్థలు అరాకొరా సదుపాయాలతో కొట్టుమిట్టాడుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత 92 వేల పాఠశాలలు మూసి వేయబడ్డాయి అన్నారు. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ మొత్తం శ్రీ చైతన్య, నారాయణ జూనియర్ కళాశాలల యాజమాన్యాల గుప్పిట్లో ఉందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో చదువుకున్న విద్యార్థులు మానసిక వికలాంగులుగా మారుతున్నరన్నారు. ఉన్నత విద్య అనంతరం 80 శాతం మంది యువకులు నిరుద్యోగులుగా మిగులుతున్నారన్నారు. స్వీడన్, ఫిన్లాన్ లాంటి దేశాలలో మాదిరిగా విద్యా వ్యవస్థ మొత్తం ప్రభుత్వ ఆధీనంలో ఉండాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యాపారీకరణ విధానాలను నిలిపివేసి, అందరికీ సమగ్ర ఉచిత విద్యను అందించే బాధ్యత తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున నిలదీస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ లు జి.వెంకటదాసు, వినాయక్ రెడ్డి, కవి షాయెబ్ ఉల్లా, జర్నలిస్ట్ ఓ. సాంబశివరావు, పెరిక బిక్షపతి, డా.ఎం.ఎన్.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత....



**పోరు తెలంగాణ ఆగస్టు 31: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.హరిత అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్‌కు చెందిన సూర పరమేశ్వర్ రావు తన పట్టా భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, కౌటాల మండలం మొగడ్ దగడ్‌కు చెందిన షాలు తామి పాటేదార్ దివ్యాంగత్వ పింఛన్ మంజూరు చేయాలని, లింగాపూర్ మండలం పిట్ట తాండాకు చెందిన బోడ బాపూరావు డీఎంఎఫ్‌టీ నిధుల బిల్లులు మంజూరు చేయాలని దరఖాస్తులు సమర్పించారు. కౌటాల మండలం తలోడికి చెందిన టేకం శ్రీశైలం మీ-సేవ కేంద్రం మంజూరుకు, దహేగాం మండలం చంద్రపెల్లికి చెందిన బద్ది శంకర్ సదరం ధృవపత్రం, పింఛన్ కోసం, కెరమెరి మండలం పరందోలికి చెందిన రాథోడ్ పుష్పలత ఘాట్ సెక్షన్ గ్రావెల్ పని బిల్లుల కోసం, బెజ్జూర్ మండలం పోతేపల్లికి చెందిన నాయిని సుశీల దివ్యాంగ పింఛన్ కోసం దరఖాస్తులు అందజేశారు. తెలంగాణ వీరభద్రీయ కుల సంఘం ప్రతినిధులు సంచార జాతుల వారికి సంక్షేమ పథకాలు అందించాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## హిమాలయాలు కేవలం మంచు కొండలు కావు

భారతదేశానికి సహజ రక్షణ కవచాలు.



**పోరు తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా, ఆగస్టు 31 :** యాదాద్రి భువనగిరి జిల్లా, మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, వర్తమాన కవయిత్రి మంజుల పత్తిపాటి పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ హిమాలయాల పరిరక్షణపై ఆందోళన వ్యక్తం చేశారు. "హిమాలయాలు కేవలం మంచుకొండలు కావు... భారతదేశానికి సహజ రక్షణ కవచాలు, నదులకు జీవనాధారాలు, వాతావరణ సమతుల్యతకు కీలకమైన ప్రకృతి వరాలు. అయితే పర్యాటకం, విచ్చలవిడి నిర్మాణాలు, అడవుల నరికివేతతో వాటి సహజ స్వరూపానికి ముప్పు ఏర్పడుతోంది అని అన్నారు. హిమశిఖరాలు కరుగుతున్నా, ప్రకృతి హెచ్చరిస్తున్నా మనం ఇంకా మేల్కొనకపోవడం ఆందోళనకరం. ప్రకృతి వైపరీత్యాలు మనకు ఒక హెచ్చరికగా భావించి ఇకనైనా బాధ్యతగా వ్యవహరించాలి అని అన్నారు. మొక్కలు నాటాలి... అడవులను కాపాడాలి... హిమాలయాలను పరిరక్షించాలి. ప్రకృతి సంపదను భావితరాలకు భద్రంగా అందించడమే మన బాధ్యత" అని మంజుల పత్తిపాటి అన్నారు.

## ఇక మీ మొబైల్ లో ఇంటర్నెట్ లేకున్నా ఫోన్ పే సేవలు

**పోరు తెలంగాణ ఆగస్టు 31 :** ఫీచర్ ఫోన్ వినియోగదారులు ఇంటర్నెట్ లేకుండానే యూపీఐ చెల్లింపులు చేసేలా ఫోన్‌పే కొత్త సేవలు 'ఫోన్‌పే యూపీఐ 123పే' పేరుతో సేవలు ప్రారంభం. దేశవ్యాప్తంగా 20 కోట్ల మందికిపైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు. డిజిటల్ చెల్లింపుల ప్రయోజనాలను దేశంలోని ప్రతి మూలకు విస్తరించడమే లక్ష్యమన్న ఫోన్‌పే వ్యవస్థాపకుడు సమీర్ నిగమ్.





# మాలల 'ఛలో సెక్రటేరియట్' ఉద్రిక్తం

జీవో 99 రద్దు, రోస్టర్ విధానం సవరణకు డిమాండ్

పోలీసుల నిర్బంధాలు..

తోపులాటలో పలువురికి గాయాలు

రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ సహా పలువురు అరెస్ట్..





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 31(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** రోస్టర్ విధానాన్ని సవరించాలని, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ మాలల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఛలో సెక్రటేరియట్' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా భారీ సంఖ్యలో మాలలు హైదరాబాద్‌కు తరలివచ్చారు. జీవో నంబర్ 99ను తక్షణమే రద్దు చేయాలని, రోస్టర్ విధానంలో 20 లోపు రెండు పాయింట్లను మాలలకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ముట్టడికి ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల నిర్బంధాలను అధిగమించి కొందరు ఆందోళనకారులు సెక్రటేరియట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే ఆందోళనకారులను గ్రూపులుగా అరెస్టు చేసి హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ సహా ఆయన బృందాన్ని సికింద్రాబాద్ ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పోలీసులతో జరిగిన తోపులాటలో జాతీయ అధికార ప్రతినిధి దార సత్యంకు తీవ్ర గాయాలయ్యాయని, ఆయనను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్‌పై కూడా పోలీసులు దాడి చేయడంతో అస్వస్థతకు గురైనట్లు వారు ఆరోపించారు. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. రోస్టర్ విధానం వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, జీవో 99ను రద్దు చేసి మాల గ్రూప్-3లోని 26 కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రోస్టర్‌లో 20 లోపు రెండు పాయింట్లను మాలలకు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుండా మాలలను విద్యా, ఉద్యోగ అవకాశాలకు దూరం చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా సెక్రటేరియట్‌కు వచ్చిన మాలలపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. మహిళా ఆందోళనకారులను మహిళా పోలీసులతో అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని ఆరోపించారు. మాలలపై జరిగిన పోలీసుల దాడిని ప్రజాస్వామికవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. జీవో 99ను రద్దు చేసి రోస్టర్ విధానాన్ని సవరించకపోతే రాబోయే అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రభుత్వంపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పిల్లి సుధాకర్ హెచ్చరించారు. అన్ని జిల్లాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా మేడి అంజయ్య, నల్లాల కనకరాజు, ర్యాకం శ్రీరాములు, నాయకోటి రవికాంత్, అసాది పురుషోత్తం, గౌడెల్లి చంద్రశేఖర్, చిట్టిమళ్ళ సమ్మయ్య, సుందర్‌రావు, చింత సత్తి, రమణమూర్తి, బుట్టి సత్యనారాయణ, అల్లిబిల్లి మహేందర్, పుట్టి శ్రీనివాసరావు, శనగ ప్రభాకర్, ఇంజ బాబి, గంటల రేణుక, కనక భారతి, తీట్ల ఈశ్వరి, శీలం పుష్పలత, దొడ్డి మణెమ్మ, జక్కుల లలిత, జక్కుల సుమిత్ర, సుజాత, గజెల్లి లక్ష్మణ్, ఆరె కిషోర్, నీరటి శ్రీనివాస్, బ్యాగరి వెంకటేష్, గుజ్జుక పరుశరామ్, కాడె శంకర్, కాల్వ నరేష్, బెజ్జం రమేష్, పనికల శ్రీనివాస్, బొల్లం రాంకుమార్, ఉసిల్ల ఉదయ్, సాదు కుమారస్వామి, బండారి మహేందర్, సంపతి రఘు, తవ్వ జయపాల్, తుప్పరి నర్సింగరావు, దార సాత్విక్, గుండమళ్ళ తిరుపతి, పెరుమళ్ళ యాదగిరి, గార ఉపేందర్, లింగం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సేవ రత్న అవార్డు అందుకున్న బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్




**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువకిశోర్ పటాన్చెరు నియోజకవర్గం ఆగస్టు 31:** శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ నిర్వాహకులు నాగేంద్ర యాదవ్, దివ్య లక్ష్మి ఆధ్వర్యంలో అవార్డు అందుకున్న బేరి రామచందర్ యాదవ్. శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల శ్రీ త్యాగరాజ గాన సభ ప్రధాన హాలులో "స్వర సప్త సంగీత వాద్య నృత్య సమ్మేళనం" కార్యక్రమం నిర్వహించారు. భారతీయ శాస్త్రీయ సంగీతం, వాద్య సంగీతం, నృత్య కళల అద్భుత వేదికగా బీసీ కులాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ కు సంగీత కళా నృత్య సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో సేవా రత్న అవార్డును కార్యక్రమ నిర్వాహకులైనా బి. నాగేంద్ర యాదవ్, కార్యక్రమ ఇన్‌ఛార్జ్ బి. దివ్య లక్ష్మిలు అందించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ బేరి రామచందర్ యాదవ్ వారి అమ్మానాన్నలైన శ్రీ బేరి వెంకటమ్మ వెంకటయ్య మెమోరియల్ ట్రస్టు నామకరణ చేసి ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. సమాజంలో తమ వంతుగా యువత మత్తు మార్గాన వెళ్తున్నారని యువతకు స్పోర్ట్స్ రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ విద్యా వైద్యం సామాజికంగా సేవలందిస్తున్న బేరి రామచందర్ యాదవ్ కి మా సంస్థ తరుపున సేవా రత్న అవార్డుతో సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇది మాకు చాలా గర్వకారణం అని అన్నారు. పేద విద్యార్థులకు విద్యా ఉద్యోగాలను విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలు స్టడీ మెటీరియల్స్ మరియు యువత స్పోర్ట్స్ రంగాల్లో రాణించాలని పిల్లలకు స్పోర్ట్స్ కిట్స్ క్రికెట్ కిడ్స్ వాలీబాల్ చెస్ ఆట వస్తువులన్నీ కూడా తమ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తూ ఉంటారని గుర్తు చేశారు. అనంతరం సేవరత్న అవార్డు గ్రహీత బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ శ్రీ వాగ్దేవి వాద్య సంగీత కళా నృత్య సాంస్కృతి సంస్థ తనకు అవార్డును అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. సంస్కృతి సంస్థ నిర్వహించిన ఇలాంటి సాంప్రదాయ కార్యక్రమంలో అవార్డు అందించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్, యాదగిరి గుట్ట దేవస్థానం డైరెక్టర్ల బోర్డు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి వంటాల జంగైయ, ప్రజాపతి రాజకీయ నాయకుడు సామాజిక కార్యకర్త డాక్టర్ వీర భోగావసంత రాయలు, మునగోడ్ నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే మారమోని శ్రీశైలం యాదవ్, రాజా రావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**పోరు తెలంగాణ ప్రతినిధి// మంచిర్యాలఆగస్టు 31, 2026:** జిల్లాలో భూ రీ-సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి రెవెన్యూ సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టంను తీసుకువచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని , భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 11 నాన్ కడస్టల్ గ్రామాలు, 70 కడస్టల్ గ్రామాలు మొత్తంగా 81 గ్రామాలు రీ -సర్వేకు ఎంపిక కావడం జరిగిందని, తెలంగాణ సర్వే ఒ బౌండరీ చట్టం ప్రకారం రీ - సర్వే నిర్వహించడం జరుగుతుందని, చట్టం గురించి అవగాహన కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. గ్రామసభల ద్వారా పట్టదారులకు సమాచారం అందించాలని, మొదట గ్రామసభ నిర్వహించి సంబంధిత ప్రజలకు సమాచారం అందించి గ్రామ సరిహద్దును నిర్ణయించాలని, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ సంబంధిత భూములను సాధారణ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జి.పి.ఓ.ల ఆధ్వర్యంలో గుర్తించాలని తెలిపారు. తదుపరి సర్వే బృందంతో పాటు రెవెన్యూ బృందాలు ఏర్పాటు చేసి సర్వే నిర్వహించడం, సర్వే సమయంలో ఖచ్చితంగా ఫీల్డ్ రిజిస్టర్ నిర్వహించాలని, సంబంధిత జిపిఓలు అందుబాటులో ఉండి వివరాలను రికార్డు చేయడం ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కరణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని సర్వే పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ సర్వే సమయంలో ఫీల్డ్ రిజిస్టర్, కో రిలేషన్ స్టేట్మెంట్, ల్యాండ్ రిజిస్టర్ లను నిర్వహించాలని, సర్వే, కొ-రిలేషన్ స్టేట్‌మెంట్ తయారీతో పాటు నోటీసుల జారీ ప్రక్రియను ఏకకాలంలో చేపట్టాలని, రైతులకు నోటీసులు సకాలంలో అందజేయాలని, రీ-సర్వే ప్రక్రియపై రైతులలో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచ్ లు, రైతులకు అందించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి నిర్ణీత ప్రొఫార్మాలో ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. రీ-సర్వే పనులపై తహసిల్దార్లు ప్రత్యేక చొరవ చూపి క్షేత్రస్థాయిలో పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చిన అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ జాబితాలో నోటీసులు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చిరునామా మార్పు, డబుల్ ఎపిక్ కార్డు, మరణించిన వారి వివరాల తొలగింపు ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి....

సహా రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు

డాక్టర్ కమలాకర్....



**పోరు తెలంగాణ ఆగస్టు 31:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలం బట్టుపల్లి గ్రామంలో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సొసైటీ జిల్లా అధ్యక్షులు వంగారి ప్రవీణ్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహా రక్షణ చట్టం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒ సైబర్ క్రైమ్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ కొండగుర్ల కమలాకర్ హాజరై మాట్లాడుతూ సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఏటీఎం కార్డు వివరాలు తెలుపవద్దని సూచించారు. ఫోన్లకు వచ్చే మెసేజ్ లకు, వాట్సప్ లింక్ లకు, ఏపీకే ఫైల్స్ కు, రివార్డ్ ఫైల్స్ కు స్పందించ వద్దని తెలిపారు. ఓటిపి ఎవరికి షేర్ చేయొద్దని సూచించారు. అనుచిత ఫోన్ ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బెట్టింగ్ యాప్స్ కు దూరంగా ఉండాలని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అవగాహన ద్వారానే సైబర్ మోసాలు అరికట్టవచ్చుని సూచించారు. సైబర్ మోసాల పట్ల ఎలాంటి అనుమానం వచ్చిన స్థానిక పోలీసులను సంప్రదించాలని అన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేయలని లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సంప్రదించాలని తెలిపారు. పోలీస్ శాఖ అధికారుల, బ్యాంకు అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం సొసైటీ జిల్లా కోశాధికారి గజ్జల తిరుపతి, కాగజ్నగర్ డివిజన్ అధ్యక్షులు మదాసు నాగేష్, కాగజ్నగర్ మండల అధ్యక్షులు కడారి శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి సంతోష్, మండల ఉపాధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం

# హాజరుకు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత.....







**పోరు తెలంగాణ ఆగస్టు 31:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ కె.హరిత అధ్యక్షతన జూమ్ ద్వారా సమీక్ష సమావేశం జరిగింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారితో కలిసి మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సి.ఆర్.పి.లతో కలెక్టర్ సమీక్షించారు. విద్యార్థులు వందశాతం ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేలా, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వందశాతం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో 627 పాఠశాలల్లో ఎఫ్.ఎల్.ఎన్. కార్యక్రమాలు అమలవుతున్నాయని, 1 నుంచి 5వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. 2వ తరగతి విద్యార్థులకు ప్రాథమిక దశలోనే తెలుగు, ఇంగ్లీష్, గణితంపై పట్టు వచ్చేలా నాణ్యమైన బోధన అందించాలని, విద్యార్థులకు కంప్యూటర్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని ప్రతి పాఠశాలను సందర్శించి విద్యాబోధన, విద్యార్థుల పఠనశక్తిని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపార

# పద్మశాలి సంఘం లో నూతన కార్యవర్గం ఏర్పాటు





**పోరు తెలంగాణ: (చాట్ల జితేంద్ర వేల్పూర్):** భీంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలి సంఘంలో జిల్లా ప్రచార కార్యదర్శి కొండి రమేష్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. పద్మశాలి సంఘం అధ్యక్షులుగా కొండి గంగాధర్, ప్రధాన కార్యదర్శి బొమ్మకంటి గోవర్ధన్, క్యాషియర్ నాగుల ప్రసాద్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి పద్మశాలి కుల సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహణ



**పోరు తెలంగాణ ఆగస్టు 31:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కగజ్ నగర్ మండలం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ షాహీన్ సుల్తానా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ కమిషనర్ బి. తిరుపతి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, ఫాగింగ్ మెషీన్లు, ఎల్ఈడీ లైట్లు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై చర్చించారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.

# కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పెండింగ్ సమస్యలపై కౌన్సిలర్ల నిరసన



**పోరు తెలంగాణ ఆగస్టు 31:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత, బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. కౌన్సిల్ పదవీకాలం ప్రారంభమై ఎనిమిది నెలలు గడుస్తున్నా మున్సిపాలిటీ నిర్వహణ నామమాత్రంగా సాగుతోందని కౌన్సిలర్ వలి విమర్శించారు. పట్టణంలో వీధిలైట్లు ఏర్పాటు చేయడం లేదని, కుక్కల బెడద తీవ్రంగా ఉన్నా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి తీర్మానం అవసరమని అధికారులు చెబుతుండగా, రెండు నెలల క్రితమే బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీర్మానం అందించినా ఇప్పటివరకు పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగజ్‌నగర్‌లోని పలు కాలనీల్లో దోమలు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని డాక్టర్ అనిత తెలియజేశారు. ప్రతి కౌన్సిల్ సమావేశంలో దోమల సమస్యను ప్రస్తావిస్తున్నా అధికారులు స్పందించడం లేదని, ఫాగింగ్ నిర్వహించాలని తీర్మానం చేసినా అది కేవలం కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. పట్టణ ప్రజల ప్రధాన సమస్యలకు ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని, పెండింగ్ సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాశీగుడను అంటూ దొంగ దోచుకున్న సొత్తు కట్టించండి అంటూ నిజమైన దివ్యాశీగుడు పిర్యాదు




**పోరు తెలంగాణ సత్తుపల్లి:** తల్లాడ స్థానిక పట్టణానికి చెందిన వాడవల్లి నాగేశ్వరరావును వ్యక్తి అనేక మోసాలకు పాల్పడుతూ నేను దివ్యాంగుడను అంటూ తప్పుడు ధ్రువీకరణలు పొంది ప్రభుత్వాన్ని మోసం చేసి ప్రజల సొత్తు స్వాహ చేసిందు,అతనిపై 318 మరియు 314 సెక్షన్స్ క్రింద స్థానిక పోలీస్ స్థానాల్లో కేసులు నమోదు చేయటం కూడా జరిగింది.దివ్యాంగుల ధ్రువీకరణ రద్దు పరచడం జరిగింది సుమారు 1,49,000 వేలు పై చినుకు తక్షణమే అతని వద్ద నుండీ రెవెన్యూ రికవరీ యాక్ట్ 1864 సెక్షన్ 52 మరియు సెక్షన్ 8 ని ప్రయోగించి తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకొని ఇతనిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక ప్రజావాణి నోడల్ అధికారి శ్రీధర్ రాజుకి పిర్యాదు చేసిన గాదే నాగేంద్ర బాబు. ప్రజావాణి నోడల్ అధికారిణి వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గతంలోనే స్థానిక రెవెన్యూ అధికారి వారికి రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేసి ఈ వాడవల్లి నాగేశ్వరరావు పై రికవరీ యాక్ట్ అమలు చేసి దోచుకున్న సొత్తును తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోమని నేను తాకిదులు జారీ చేయడం జరిగింది. కనుక ప్రజావాణిలో మీరిచ్చిన ఫిర్యాదు మేరకు మరొక్కసారి స్థానిక రెవెన్యూ అధికారి వారికి మీ ఫిర్యాదు సిఫారసు చేస్తాను అతనిపై శాఖపరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేలా చూస్తాను అంటూ ఆ అధికారి ఫిర్యాదు దారికి పాత్రికేయులకు వివరించడం జరిగింది..